


సంచలన వార్తలకు

# నేడు

TELUGU DAILY

ఆదివారం | 20.09.2026 | సంపుటి : 4 | సంచిక : 143 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




మరోసారి బ్యాంకుల దేశవ్యాప్త సమ్మె..

08




## యూపీఐ వద్దు.. నగదు మాత్రమే చెల్లించండి

**దుకాణాల్లో దర్శనమిస్తున్న బోర్డులు**

**యూపీఐ చేస్తే అదపను చార్జీలు చెల్లించాలంటూ కండీషన్**

కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటా మని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు.

02

# జన్వాడ ఫాంహౌస్‌కు అనుమతుల్లేవ్

## ఫాంహౌస్ ముమ్మాటికీ.. కేటీఆర్‌దే

**రెవెన్యూ రికార్డుల్లో భార్య శైలిమ.. అత్త శశిరేఖ పేర్లు**

**అనుమతులు లేకుండా నాలాపై నిర్మించారు**

**విచారణ జరిపి చర్యలు తీసుకోండి**

**హైడ్రా కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు**

**ఫాంహౌస్ వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు**

**ఇరు పార్టీల నాయకుల రాకతో ఉద్రిక్తం**

జన్వాడలోని ఫాంహౌస్ ముమ్మాటికీ అక్రమ నిర్మాణమని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం ఆరోపించింది. ఎలాంటి అనుమతులు లేకుండా నాలాపై దీనిని నిర్మించారని తెలిపింది. ఈ నిర్మాణాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలంటూ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. శనివారం జన్వాడ ఫాంహౌస్‌ను పరిశీలించేందుకు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేక బస్సులో హైదరాబాద్ నుంచి వచ్చారు.



రంగారెడ్డి, సెప్టెంబర్ 19 : ఫాంహౌస్ తనదేనని, ఇక్కడికి వస్తే కేసులు పెడతానని అంటున్న ప్రదీప్‌రెడ్డి ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టారని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి రావాలనే ఉద్దేశం తమకు లేదని, అయితే కేసీఆర్ కుటుంబం అధికార దుర్వినియోగానికి పాల్పడిన తీరును ప్రజలకు చూపించేందుకే వచ్చామని అన్నారు. సూర్యాపేటలో కమ్యూనిస్టు మాజీ ఎమ్మెల్యే కుటుంబం ఇటీవల ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుందని, కేసీఆర్ కుటుంబం మాత్రం భూ దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. ప్రదీప్‌రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని డ్రోన్ ఎగురవేసినందుకు కేసు పెట్టి టెర్రరిస్టులా జైలుకు పంపారని

-మిగతా 2 లో..



## వరంగల్ ఎయిర్‌పోర్టుకు మీరే పేరు చెప్పండి

**ప్రజలకు పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి**

**విమానాశ్రయానికి ప్రజలే పేరు సూచించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి**

**భూసేకరణ కోసం రూ.295 కోట్లు వెచ్చించి.. స్థలాన్ని ఏఏఐకి అప్పగించిన ప్రభుత్వం**

**రూ.213.59 కోట్లతో టెర్మినల్, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్ నిర్మాణాలకు సన్నాహాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 19 వరంగల్ ఎయిర్ పోర్టుకు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోం దన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుం బ ప్రయోజ నాలు, విలాసవంతమైన ఫామ్‌హౌ స్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప.. వరంగల్ విమా నా శ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటా యించడంతో పాటు.. అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండి యాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూ పుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం విమా నాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు.

-మిగతా 2 లో..





## సుప్రీంకోర్టుకు 'దానం'

**అనర్హత వేటుపై పిటిషన్ దాఖలు**

పార్టీ ఫిరాయించారన్న కారణంతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే తనకు సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలేదని ప్రకటించిన ఆయన అందుకు విరుద్ధంగా శనివారం మధ్యాహ్నం సర్వోన్నత న్యాయస్థానంలో డైరీ నం.58219/2026తో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రతివాదిగా భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఉ న్నారు. భారాస ఎమ్మెల్యేగా ఉన్న తాను 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినందుకు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పేరా 2(1)(ఎ) రెడ్ విత్ ఆర్టికల్ 191(2)కింద తనను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు.

02



## దానం నాగేందర్ అనర్హత.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెంపపెట్టు

**దానం వ్యవహారం నుంచి ఫిరాయింపుల దాకా.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు**

**దానం నాగేందర్ అనర్హత తీర్పు రెండు పార్టీలకు గుణపాఠమని కిషన్‌రెడ్డి వ్యాఖ్య**

**గతంలో వైఎస్ఆర్, కేసీఆర్ హయాంలోనూ ఫిరాయింపులకు ప్రోత్సాహం లభించిందని ఆరోపణ**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందంటూ కేంద్ర మంత్రి విమర్శలు**

02

## ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి

**దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి**

**రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ సవాల్**

వనపర్తి, సెప్టెంబర్ 19 : కాంగ్రెస్ నేతలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల తో రాజీనామా చేయించాలని.. దమ్ముంటే రాజీనామా చేసి ఎన్ని కలకు రావాల న్నారు. శనివారం ఆయన వనపర్తి నియోజకవర్గం పెబ్బేరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతు లకు అన్యాయం జరిగితే ఊరుకో మంటూ తేల్చి చెప్పారు. "ప్రభు త్వాన్ని వదిలిపెట్టేది లేదన్న కేటీ ఆర్.. నీళ్లు ఇవ్వకపోతే గల్లా పట్టుకుని అడుగుతా మన్నారు. తాము తప్పు చేశామని తేలితే చర్యలు తీసుకోండి.. అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్ష న్ తీసుకోవాలన్నారు. రైతులు వి ద్యుత్, సాగునీటి కష్టాలు చె ప్పుకున్నారు.. ప్రకృతి కావాల్సినన్ని నీళ్ళు ఇచ్చినా

-మిగతా 2 లో..





**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## '84 టీఎంసీల లెక్క ఎక్కడ?'

**కృష్ణా జలాలపై హరీశ్‌రావు ఫైర్..**

**శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు తీసుకున్నామన్న ఉత్తమ్ ప్రకటనను తప్పుబట్టిన హరీశ్‌రావు**

**కల్వకుర్తి ద్వారా ఇప్పటివరకు 8 టీఎంసీలు ఎత్తిపోశారని వ్యాఖ్య**

**మూడేళ్లలో ఏపీ 718 టీఎంసీలు వినియోగిస్తే తెలంగాణ 216 టీఎంసీలకే పరిమితమైందని వెల్లడి**



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నేటి ప్రస్థానం): కృష్ణా జలాల వినియోగం విషయంలో తెలంగా ణకు నష్టం జరుగుతోందంటూ బీఆర్ఎస్ సీని యర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభు త్వంపై విమర్శలు గుప్పించారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఎత్తిపోతల పథకాలను వినియోగించుకోవడం లేదని ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీశై లం జలాల వినియో గంపై అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించిన గణాంకాలను హరీశ్‌రావు ప్రశ్నిం చారు. ప్రస్తుత సంవత్సరంలో శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని తెలంగాణ వినియోగిం చిందన్న ప్రకటన వాస్తవ పరిస్థితులకు సరిపో వడం లేదని అన్నారు. కల్వకుర్తి ఎత్తిపో తల పథకం ద్వారా ఇప్పటివరకు

-మిగతా 2 లో..

## సంపూర్ణ మద్య నిషేధంతో నష్టాలే ఎక్కువ

**కల్తీ మద్యం తాగడం వంటివాటికి దారితీస్తుంది : సుప్రీంకోర్టు**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 : సంపూర్ణ మద్య నిషేధం అసలు సమస్యను పరిష్కరించకపోగా ఇతరత్రా అనేక కష్టనష్టాలకు కారణమవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అక్రమ సారా వ్యాపారాలు, కల్తీలు, దొంగచాటు రవాణాలు, రహస్యంగా మద్యం తాగడం వంటివాటికి ఇది దారితీస్తుందని హెచ్చరిం చింది. ప్రభుత్వాలు పన్ను రాబడులను

మిగతా 2 లో

## సుప్రీంకోర్టుకు 'దానం'



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 : ఎమ్మెల్యే అనర్హత విషయంలో స్పీకర్ తీసుకొనే నిర్ణయాలను న్యాయస్థానాలు సమీక్షించడానికి వీల్లేదన్నది ఆయన ప్రధాన వాదన. సభ లోపల సభ్యుడి వ్యవహారం ఆధారంగానే స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సభ వెలుపల సభ్యుడి ప్రవర్తన గురించి అంటే తను మరోపార్టీ తరఫున పోటీచేసి నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది స్పీకర్ పరిధిలోకి రాదన్నారు. ఈవిషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయం సరైందే కాబట్టి అందులో ఆర్టికల్ 226 కింద హైకోర్టు జోక్యం చేసుకోకూడదన్నారు. సభ వెలుపల సభ్యుడి ప్రవర్తనతో సభ లోపలి వ్యవహారాలకు ప్రత్యక్షంగా సంబంధం లేదని, అందుకే స్పీకర్ ఆర్టికల్ 191(1)(2) కింద ఆ రెంటినీ వేర్వేరుగా చూసి నిర్ణయం తీసుకున్నారన్నారు. తాను భారాస సభ్యత్వాన్ని వదులుకోలేదని, అలాగే కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని చెప్పారు. మెడలో 3 రంగుల కండువా వేసుకు న్నంత మాత్రాన కాంగ్రెస్‌లో చేరినట్లు కాదన్నారు. ఇందులో



## '84 టీఎంసీల లెక్క ఎక్కడ?'

(మొదటిపేజీ తరువాయి)

సుమారు 8 టీఎంసీల నీరు మాత్రమే తరలించారని పేర్కొన్నారు. కల్వకుర్తి పథకానికి సంబంధించిన ఐదు మోటార్లలో రెండింటినే నడుపుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. మరోవైపు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని విమర్శించారు. నీరు, విద్యుత్ సామర్థ్యం అందుబాటులో ఉన్నప్పటికీ సాగు అవసరాలకు నీటిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కృష్ణా నదీ జలాల వినియోగానికి సంబంధించిన గణాంకాలను ప్రస్తావిస్తూ, గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీలను ఉపయోగించుకోగా తెలంగాణ వినియోగం 216 టీఎంసీల వద్దే ఉందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణా నీటి వినియోగం అత్యల్పంగా నమోదైన కాలంగా 2024--25ను ఆయన పేర్కొన్నారు. అయితే ఈ సంఖ్యలు హరీశ్‌రావు మీడియా సమావేశంలో ప్రస్తావించిన గణాంకాలుగా పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడు, వెలిగొండ మార్గాల ద్వారా కృష్ణా జలాలను తరలించుకుపోతోందని కూడా హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని ముందుగానే వినియోగించుకోవడంతో పాటు రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి పరిస్థితులను కారణంగా చూపకుండా నీటి నిర్వహణలో జరిగిన లోపాలపై దృష్టి పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## సంపూర్ణ మద్య నిషేధంతో నష్టాలే ఎక్కువ

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోవడంతో పాటు మద్య నిషేధం అమలుకు భారీగా ఖర్చుపెట్టాల్సి వస్తుందంటూ పలు నిదర్శనాలను ప్రస్తావించింది. కల్తీమద్యం సమస్యను నివారించేందుకు గాను ఔషధేతర తయారీదారులకు విక్రయించే మిథనాల్‌కు రంగు, చేదు రుచిని జోడించాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిబంధనను శుక్రవారం కొట్టివేస్తూ వెలువరించిన తీర్పులో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం ఈ విషయాలను పేర్కొంది. కల్తీమద్యం మరణాల నివారణకు గాను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పలు సూచనలు చేసింది. "రంగు, రుచిని మార్చడం వల్లకానీ, అందుబాటులో లేకుండా చేయడం వల్ల కానీ మద్యం తాగాలన్న తీవ్రమైన తృష్ణను వ్యసనపరులు వదులుకోలేరు. దీనికి బదులుగా ఎక్సైజ్ చట్టాలను బలోపేతం చేసి మద్యం రవాణా, నిల్వ, తయారీపై కఠిన నియంత్రణలను అమలుచేయడం ఉత్తమం. మిథనాల్‌కు రంగు, చేదు రుచిని జోడించాలన్న మహారాష్ట్ర నిబంధనలు ఔషధేతర ఉత్పత్తిదారుల పరిశ్రమలను దెబ్బతీస్తాయి. మిథనాల్ విక్రయాలు, సరఫరాపై గట్టి నియంత్రణ చర్యలు అవసరం. మహారాష్ట్ర ప్రభుత్వ తీసుకొచ్చిన నిబంధనలు రాజ్యాంగబద్ధంగా, సహేతుకంగా లేవు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి

(మొదటిపేజీ తరువాయి)



రైతులకు సాగునీరు లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు. "ఉమ్మడి రాష్ట్రంలో ఏడు మెగా వాట్ల సామర్థ్యం ఉండేది. 24 వేల మెగా వాట్లకు విద్యుత్ సామర్థ్యం పెంచినం. అత్యల్పంగా కృష్ణా నీళ్లను తెలంగాణ వాడుకుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముప్పై శాతం కంటే ఎక్కువ నీళ్లు వాడుకున్నాం. పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్ట్‌లుగా మార్చినం. ఏడు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. వరద వస్తుందంటే వెంటనే నీళ్లు మళ్లించే వాళ్లం. చెక్ డ్యామ్‌లు, చెరువులు నింపి పాలమూరులో నీళ్లు ఇచ్చాం. రెండు సబ్ స్టేషన్‌లకు రైతులతో కలిసి వెళ్ళాం. అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావట్లేదని రైతులు చెప్తున్నారు. లో వోల్టేజ్, తరచూ కట్ చేయడంతో మోటార్లు కాలిపోతున్నాయని అంటున్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోతుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విద్యుత్ కష్టాలు, తాగునీటి కష్టాలు ఉన్నాయని చెప్తున్నారు. అన్ని ఉన్నప్పటికీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉంది" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మీరే పేరు చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

వరంగల్ ప్రాంతానికి కొత్త విమానాశ్రయం రూపంలో మరో కీలక మౌలిక వసతి అందుబాటులోకి రానుంది. మామునూరులో నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు ఎలాంటి పేరు పెట్టాలన్న అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల ముందుకు తీసుకొచ్చారు. పరిశ్రమల విస్తరణ, పర్యాటక రంగం అభివృద్ధి, విద్యా అవకాశాలు, ఉద్యోగ కల్పనతో పాటు పెట్టుబడులకు ఇది కీలక అనుసంధాన కేంద్రంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణకు ఈ ప్రాజెక్టు మరో ముఖ్యమైన మౌలిక వసతిగా నిలుస్తుందని తెలిపారు. ఇక విమానాశ్రయ నిర్మాణాన్ని ఏఏఐ మూడు విభాగాలుగా చేపట్టనుంది. తొలి దశలో 953 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎయిర్‌పోర్టు ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. తదుపరి దశలో రన్‌వే, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. చివరి ప్యాకేజీలో ప్రయాణికుల టెర్మినల్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, అగ్నిమాపక కేంద్రం, విద్యుత్ సంబంధిత సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు సుమారు రూ.213.59 కోట్ల వ్యయాన్ని అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను నవంబర్‌లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అనంతరం డిసెంబర్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మొత్తంగా మామునూరు





విమానాశ్రయం నిర్మాణ పనులు ముందుకు సాగుతున్న నేపథ్యంలో దానికి పేరును సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. వరంగల్ చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రతిబింబించేలా ప్రజలు పేర్లను సూచించనున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలను పరిశీలించిన అనంతరం విమానాశ్రయానికి తుది పేరును ప్రభుత్వం ఖరారు చేయనుంది.

## జన్వాడ ఫాంహౌస్‌కు అనుమతుల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అప్పుడు ఈ ఫాంహౌస్‌లో నాటి మంత్రి కేటీఆర్ ఉంటున్నారని ప్రదీప్‌రెడ్డి స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. అంతేకాకుండా.. జన్వాడ భూములు సత్యం రామలింగరాజు బినామీ కంపెనీ శతభిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుమీద ఉన్నాయని చెప్పారు. అయితే సత్యం కుంభకోణం బయటపడిన తర్వాత..సత్యం ఆస్తులతోపాటు శతభిష కంపెనీ ఆస్తులు, ఆ కంపెనీకి చెందిన 6లక్షల షేర్లపై ఈడీ, ఐటీ శాఖలు నిషేధం విధించాయని పేర్కొన్నారు. కానీ, ఐటీ ట్రైబ్యునల్‌లో కేసులుండగానే భూములను బదలాయించారన్నారని ఆరోపించారు. జన్వాడలోని సర్వే నంబర్లు 301, 311, 313లోని భూములను కేటీఆర్ బాల్యమిత్రుడికి చెందిన డీఎన్‌బీ కంపెనీకి బదిలీ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. డి.రాజేశ్ అనే వ్యక్తి సత్యం రామలింగరాజు కుమారుడికి సన్నిహితుడని, అతని పేరిట ఉన్న కంపెనీకి బదిలీ చేశారని అన్నారు. ఈడీ, ఐటీ కేసుల్లో ఉన్న 13 ఎకరాలను ఎలా? ఎందుకు? రిలీజ్ చేశారనేది బయటపడాలన్నారు. ప్రదీప్‌రెడ్డికి ఈ భూమి ఎలా బదిలీ అయిందో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చెప్పాలన్నారు. భూమి బదిలీపై ఈడీ, ఐటీ శాఖలు హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని పశ్నించారు. ఇది ముమ్మాటికీ కేటీఆర్‌కు



చెందిన ఫాంహౌసేనని, ప్రదీప్‌రెడ్డి కేటీఆర్ బినామీ అని అన్నారు. ఐటీ, ట్రైబ్యునల్ కోర్టులో ఉన్న 13 ఎకరాల భూముల బదిలీ ఎలా జరిగిందన్నారు. ఇందులో ప్రదీప్‌రెడ్డి పేరిట 4 ఎకరాలు ఉండగా, కేటీఆర్ భార్య శైలిమ పేరిట 3.02 ఎకరాలు, కేటీఆర్ అత్త శశిరేఖ పేరిట 4 ఎకరాల భూమి ఉందని తెలిపారు. లీజ్ అగ్రిమెంట్ ఉంటే ఆ పత్రాలను ఎందుకు చూపడం లేదని నిలదీశారు. జీవో 111 పరిధిలో ఫిరంగి నాలాను ఆక్రమించి భారీ కాంక్రీట్ భవనాన్ని అక్రమంగా నిర్మించారని అన్నారు. నాడు మ్మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్..అక్రమంగా నిర్మించిన ఎలా ఉన్నారని ప్రశ్నించారు. జన్వాడ ఫాంహౌస్ ఎవరి పేరిట ఉందో

## ఇక అప్పులపైనే ఆధారపడం


**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**న్యూఢిల్లీ:** తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో శనివారం జరిగిన 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ'సదస్సులో తెలంగాణ నుంచి భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, ఇతర కీలక ప్రాజెక్టుల కోసం ఇకపై ప్రైవేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్‌ను భారీగా సమీకరించే నమూనా వైపు రాష్ట్రం దృష్టి సారిస్తోందని చెప్పారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్కను తగ్గించడానికి, వయబిలిటీ గ్యాప్ పూడ్చడానికి ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తామన్నారు. ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ మార్గాలను మరింత బలోపేతం చేస్తామని భట్టి వివరించారు. దేశాన్ని 2047 నాటికి అభివద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న వికసిత్ భారత్ ప్రయాణంలో తెలంగాణ కీలక భూమిక పోషిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2025--26 నాటికి తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇది 10.7 శాతం వృద్ధి అని.. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు రూ. 2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండి రూ. 4,18,931కి చేరిందని భట్టి గుర్తుచేశారు. ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వివరించారు. రాష్ట్ర సమతుల్య అభివృద్ధి కోసమే క్యూర్, ప్యూర్, రేర్ అనే ప్రత్యేక నమూనాను అమలు చేస్తున్నట్లు భట్టి వివరించారు. అలాగే దేశంలోనే తొలి నెట్--జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా 30 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి వెల్లడించారు. రాష్ట్ర యువతే తెలంగాణ అసలైన బలమని భట్టి పేర్కొన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. సామాజిక భద్రత, మెరుగైన వైద్యం, మహిళా సాధికారతతో కూడిన సమ్మిళిత అభివృద్ధే రాష్ట్ర విధానమని భట్టి వివరించారు.

## యూపీఐ వద్దు.. నగదు మాత్రమే చెల్లించండి

- దుకాణాల్లో దర్శనమిస్తున్న బోర్డులు
- యూపీఐ చేస్తే అదపను చార్జీలు చెల్లించాలంటూ కండీషన్




**న్యూఢిల్లీ :** కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. దిల్లీ శివారులోని ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.



## దానం నాగేందర్ అనర్హత.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెంపపెట్టు

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

- దానం వ్యవహారం నుంచి ఫిరాయింపుల దాకా.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- దానం నాగేందర్ అనర్హత తీర్పు రెండు పార్టీలకు గుణపాఠమని కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- గతంలో వైఎస్‌ఆర్, కేసీఆర్ హయాంలోనూ ఫిరాయింపులకు ప్రోత్సాహం లభించిందని ఆరోపణ
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందంటూ కేంద్ర మంత్రి విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 :** తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి రాజకీయ దుమారం రేపుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి.కిషన్‌రెడ్డి ప్రస్తావిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజల తీర్పుతో ఏర్పడిన రాజకీయ సమీకరణాలను మార్చేందుకు పార్టీ మార్పులను ప్రోత్సహించడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ పాలన సమయంలో ఎమ్మెల్యేల పార్టీ మార్పులకు ప్రోత్సాహం లభించిందని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులకు శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు ఇచ్చారని ఆయన విమర్శించారు. దానం నాగేందర్ వ్యవహారాన్ని ప్రస్తావించిన కిషన్‌రెడ్డి.. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన ఆయన అనంతరం కాంగ్రెస్‌లో చేరారని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీజేపీ నేతలు న్యాయపోరాటం చేయడంతో హైకోర్టు తాజాగా ఆయనపై అనర్హత వేటు వేసిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలపైనా కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. భూవ్యవహారాలు, అవినీతి ఆరోపణల విషయంలో ఇరు పార్టీల మధ్య పోటీ నెలకొందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక ఆరోపణలు చేసినప్పటికీ, ఇప్పటివరకు వాటిపై కఠిన చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ రెండు పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం రాజకీయ విమర్శలు చేసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌కు కాంగ్రెస్ లోక్‌సభ టికెట్ ఇవ్వడానికి కారణాలేమిటో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులపై తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య విమర్శలు మరింత తీవ్రం అవుతున్నాయి. దానం నాగేందర్ వ్యవహారంలో హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి ఆయన శాసనసభ స్థానాన్ని ఖాళీగా పరిగణించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. రాబోయే ఎన్నికలను ఎదుర్కొనేందుకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలు, రాజకీయ విధానాల ఆధారంగా ఎన్నికల బరిలోకి దిగుతామని పేర్కొన్నారు.

# జిల్లాలోని 7 పీహెచ్‌సీల్లో పాలీక్లినిక్స్

- పేదలకు అందుబాటులో స్పెషలిస్టుల వైద్య సేవలు
- మేడ్చల్ జిల్లాలో నెల రోజుల నుంచి అందుబాటులో సేవలు
- నెల రోజుల్లో 1,116 మందికి ఓపీ సేవలు
- సద్వినియోగం చేసుకోవాలి : డీఎం అండ్‌హెచ్ఓ ఆనంద్





**మేడ్చల్, నేడు బ్యూరో:** ప్రాథమిక కేంద్రాల ద్వారా సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే పాలీక్లినిక్ లను ప్రవేశ పెట్టింది. ఈ పాలిక్లినిక్ ల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు స్పెషలిస్టులైన వైద్యులతో ఓ.పీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఫస్ట్ ఫేస్ కింద మేడ్చల్ జిల్లాలోని 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పాలిక్లినిక్ లను ప్రవేశ పెట్టింది. జిల్లాలో గత నెల నుంచి ఈ పాలీక్లినిక్ ల సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్యక్రమంలో బాగంగా, రోజుకో స్పెషలిస్టు డాక్టర్ తో వివిధ కేటగిరీస్ లలో ఓ.పీ వైద్య సేవలు అందిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పీ.హెచ్.సీ లలో కూడా ఇవి అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో పాలిక్లినిక్ సేవలు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని మూసా పేట్, వినాయక్ నగర్, షాపూర్ నగర్, మల్లాపూర్, నిజాం పేట్, వెంకట్ రెడ్డి నగర్, అలాగే, పర్వత నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పాలిక్లినిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని పేదలు పెద్ద వైద్యం పొందాలంటే ఇటు మేడ్చల్ కు గానీ అటు ఘట్ కేసర్ కు గానీ దూర ప్రదేశాలకు వెళ్ళాల్సి ఉంటుంది. ఈ దూరాన్ని తగ్గించడానికి ప్రభుత్వం పీ.హెచ్.సీ ల లోనే పాలిక్లినిక్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో ఈ పాలీక్లినిక్ ల ద్వారా 308 మందికి గైనకాలిక్ సేవలు, 202 మందికి ఆర్థోపెడిక్ సేవలు, 167 మంది పిల్లలకు పీడియాట్రిక్స్ సేవలు, 113 మంది రెస్పిరేటరీ మెడిసిన్ సేవలు, 26 మందికి పల్మోనోలోజీ సేవలు, 129 మందికి జనరల్ సర్జరీ సేవలు, 82 మందికి కంటి వైద్యం సేవలు, అలాగే, 89 మందికి ఈ.ఎన్.టి సేవలు అందించారు.

## సద్వినియోగం చేసుకోండి

**డా: కె.ఆనంద్, మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి :**



సామాన్య ప్రజలకు స్పెషలిస్టులతో వైద్య సేవలు అందించేందుకు స్థానిక పీ.హెచ్.సీ ల్లోనే పాలిక్లినిక్ లను ప్రవేశ పెట్టింది. ఒక్కో రోజు ఒక్కో స్పెషలిస్టు డాక్టర్స్ 24/7 గంటలు అందుబాటులో ఉంటారు. ఆయా పీ.హెచ్.సీ ల పరిధిలోని ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్: కె. ఆనంద్ సూచించారు.




## ప్లాట్లలో అక్రమ ప్రవేశం..

**సినీ నిర్మాత సి.కళ్యాణ్‌పై ఫిర్యాదు**

**శేరిలింగంపల్లి, నేడు న్యూస్:** సున్నం చెరువు ప్రాంతంలోని తమ ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి బ్లూ షీట్లు ఏర్పాటు చేశారంటూ సినీ నిర్మాత సి.కళ్యాణ్‌తో పాటు మరికొందరిపై ప్లాట్ యజమానులు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సియాట్ సొసైటీ అధ్యక్షుడు శ్యామ్‌సింగ్ ఆధ్వర్యంలో యజమానులు ఈ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గుట్టల బేగంపేట పరిధిలోని సర్వే నంబర్లు 12, 12ఏ, 13లో తమకు ప్లాట్లు ఉన్నాయని యజమానులు పేర్కొన్నారు. శనివారం ఉదయం సి.కళ్యాణ్, ప్రకాష్ ధారక్, ప్రేమలత తదితరులు తమ ప్లాట్లలోకి ప్రవేశించి బ్లూ షీట్లు ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. తమ స్థలాల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు, స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ తమ ప్లాట్లను ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యజమానులు తెలిపారు. కొంతకాలంగా ఎలాంటి ఇబ్బంది లేకపోయినప్పటికీ, తాజాగా మరోసారి ఆక్రమణకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, తమ స్థలాలకు రక్షణ కల్పించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాదాపూర్ పోలీసులను కోరారు.

# రష్యా ఆంక్షల బిల్లుపై సంతకం..

**భారత్‌పై 100 శాతం సుంకాలకు ట్రంప్‌నకు పవర్**



**వాషింగ్టన్ :** రష్యా, ఇరాన్, చైనా, భారత్‌లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో రష్యా, ఇరాన్ లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాలపై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. దీంతో భారత్, చైనా (జప్త్రఅఖు)తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చరించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. భద్రతా మండలి ఆమోదం లేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.




## హెచ్-1బీపై లక్ష డాలర్ల ఫీజు..

**మళ్లీ షాకిచ్చిన ట్రంప్**

**వాషింగ్టన్ :** హెచ్-1బీ వీసా దరఖాస్తులపై విధించిన లక్ష డాలర్ల ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఈ వీసాల ద్వారా విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థల నుంచి మరో ఏడాదిపాటు ఫీజు వసూలు చేసేలా ఆదేశాలు ఇచ్చారు. తాజాగా దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకాలు చేశారు. సాధారణంగా ఈ వీసా దరఖాస్తుల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది. ఆ నిబంధన తీసుకువచ్చిన ఏడాది సమయం పూర్తవుతున్న సమయంలో ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో 12 నెలల పాటు ఈ పెంపును పొడిగించింది. 2025లో తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఐటీ సేవలను అవుట్‌సోర్సింగ్ ఇస్తున్న కంపెనీల హెచ్-1బీ రిజిస్ట్రేషన్లలో 92 శాతం తగ్గుదల నమోదైందని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. దీంతో అమెరికన్ కార్మికులు, గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. అత్యంత నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే కంపెనీలు నియమించుకునేలా చూడటం తమ ప్రధాన ఉద్దేశమని ట్రంప్ సర్కార్ చెప్తూ వస్తోంది. అమెరికా హెచ్-1బీ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న విదేశీయుల్లో భారతీయులు ముందువరుసలో ఉన్నారు. అమెరికాలో విద్యార్థి వీసాలపై ఉండి హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారికి ఈ ఫీజు వర్తించదు. అమెరికా విడిచి వెళ్లకుండా.. ఇప్పటికే ఉన్న వీసాల స్టేటస్‌ను మార్చుకునేందుకు వచ్చిన దరఖాస్తులకు ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంది. అయితే, బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు మాత్రం ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఈ లక్ష డాలర్ల రుసుమును అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో సవాలు చేయగా.. ఆ ఫీజు చట్టవిరుద్ధమని తీర్పు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ అంశం ఇతర ఫెడరల్ కోర్టుల్లో విచారణ దశలో ఉంది. ఈ ఫీజుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ.. లక్ష డాలర్ల ఫీజును మరో ఏడాది పాటు పొడిగిస్తూ ట్రంప్ ఇప్పుడు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.



## వెంకటేశ్వర నగర్‌లో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

**వివేకానంద ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ**

**మల్కాజిగిరి, నేడు న్యూస్:** మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో వివేకానంద ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, మౌలాలి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వినోద్ యాదవ్ తదితరులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివ యాదవ్, బ్రహ్మయ్య, రోజా రమణి, అంజయ్య యాదవ్, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ యువతికి కాంస్యం

**లాంగ్ జంప్‌లో సత్తా చాటిన అత్వెల్లి యువతి మండల స్నేహ**




**మేడ్చల్, నేడు న్యూస్:** సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ సర్కిల్ పరిధిలోని అత్వెల్లికి చెందిన యువతి మండల స్నేహ రాజగోపాల్ ప్రతిభ చాటింది. పాండిచ్చేరిలో ఈ నెల 16న నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్--18 విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన స్నేహ లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించింది. దక్షిణ భారతదేశంలోని తొమ్మిది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో స్నేహ తెలంగాణ తరపున బరిలోకి దిగింది. లాంగ్ జంప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ మూడో స్థానాన్ని దక్కించుకుని కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి సౌత్ జోన్ స్థాయిలో పతకం సాధించడం ద్వారా స్నేహ తన ప్రతిభను చాటడమే కాకుండా మేడ్చల్ ప్రాంతానికి కూడా గుర్తింపు తీసుకొచ్చింది.

### చిన్ననాటి నుంచే అథ్లెటిక్స్‌పై ఆసక్తి

అత్వెల్లికి చెందిన స్నేహ చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని అథ్లెటిక్స్‌లో ప్రత్యేకంగా రాణిస్తోంది. లాంగ్ జంప్‌లో నిరంతరం సాధన చేస్తూ వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభను మెరుగుపరుచుకుంటోంది. కఠినమైన సాధన, పట్టుదలతో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైంది. సౌత్ జోన్ పోటీల్లో తొమ్మిది రాష్ట్రాల నుంచి ప్రతి భావంతులైన క్రీడాకారులు పాల్గొన్నప్పటికీ స్నేహ పోటీని ఎదుర్కొని కాంస్య పతకం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సౌత్ జోన్ స్థాయిలో కాంస్య పతకం సాధించిన స్నేహను మేడ్చల్ ప్రాంతానికి చెందిన పలువురు అభినందించారు.

## ఢిల్లీ సీఎం సహా కేజ్రీవాల్ కుటుంబానికి 'సర్' నోటీసులు

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సహా అనేక మందికి సర్ నోటీసులు అందాయి. ఈ క్రమంలో మాజీ సీఎం కేజ్రీవాల్ కుటుంబం మొత్తానికి ఈసీ నోటీసులు వచ్చాయి. దీనిపై తీవ్రంగా స్పందించిన ఆమ్‌ఆద్మీ పార్టీ.. దిల్లీకి మూడుసార్లు సీఎంగా పనిచేసిన కేజ్రీవాల్ పేరు జాబితాలో లేకపోవడం ఏంటని ప్రశ్నించింది. న్యూదిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే మాజీ సీఎం కుటుంబీకులు ఓటర్లుగా నమోదై ఉన్నారు. తాజా ప్రక్రియలో కేజ్రీవాల్‌తో పాటు ఆయన సతీమణి సునీత, తండ్రి గోబింద్ రామ్, తల్లి గీతా దేవీ, కుమారుడు పుల్‌కిత్‌లకూ సర్ నోటీసులు అందాయి. 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' విభాగం కింద ఇవి జారీ అయ్యాయి. దీనిపై ఆప్ నుంచి విమర్శలు రావడంతో స్థానిక అధికారులు స్పందించారు. వారి పేర్లు జాబితాలో ఉన్నాయని, మునుపటి ఎస్ఐఆర్ జాబితాతో అవి మ్యాపింగ్ కానందునే నోటీసులు ఇచ్చామని చెప్పారు. మరోవైపు, తల్లిదండ్రులతో పోలిస్తే వయసులో వ్యత్యాసం ఉండటం వల్లే ముఖ్యమంత్రికి సర్ నోటీసులు ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే, వివరాలు ధ్రువీకరించుకున్నామని, తదుపరి జాబితాలో వాటిని సరిచేయనున్నట్లు చెప్పారు. ఇలా సీఎం, మాజీ సీఎంతోపాటు భాజపా దిల్లీ మాజీ అధ్యక్షుడు సచ్‌దేవా, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్, భాజపా నేత సుధాన్షు మిత్తల్ సహా పలు ప్రముఖులు ఈ నోటీసులు పొందినవారిలో ఉన్నారు.

## కండ్లకోయలో చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు

- మేడ్చల్ తహసిల్దార్ కు ఫిర్యాదు చేసిన మత్స్యకార సంఘం ప్రతినిధులు
- పోల్కమ్మ కుంట, ఎర్రకుంట ఎఫ్టిఎల్, బఫర్ జోన్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్




**మేడ్చల్, నేడు న్యూస్:** కండ్లకోయ రెవెన్యూ పరిధిలోని పోల్కమ్మ కుంట, ఎర్రకుంట చెరువుల ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్, వాటర్ స్ప్రెడ్ ఏరియాలు, వరద నీటి నాలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మత్స్యకార సంఘం, ముదిరాజ్ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు మేడ్చల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. చెరువుల పరిధిలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు కట్టలను తొలగించి ప్రీకాస్ట్ గోడలు నిర్మించడం, మట్టి పోసి చెరువు స్థలాలను పూడ్చివేయడం, చెరువులోకి వచ్చే వరద నీటి నాలాలను మూసివేయడం వంటి చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీంతో చెరువుల విస్తీర్ణం క్రమంగా తగ్గిపోవడంతో పాటు మత్స్యకారులు చెరువులకు వెళ్లేందుకు ఉన్న మార్గాలు కూడా మూసుకుపోతున్నాయని తెలిపారు. చెరువులపై ఆధారపడి జీవించే మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ముంపు ప్రమాదం చెరువుల వాటర్ స్ప్రెడ్ ఏరియా, వరద నీటి ప్రవాహ మార్గాలు ఆక్రమణలకు గురైతే వర్షాకాలంలో వర్షపు నీరు సక్రమంగా చెరువుల్లోకి చేరే అవకాశం లేక రోడ్లపైకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొన్నారు. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, భారీ వర్షాల సమయంలో కొన్ని మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వల్ల భూగర్భ జలాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నీటి కొరత, వర్షాకాలంలో ముంపు సమస్యలు మరింత తీవ్రం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర సర్వే నిర్వహించి చెరువులకు వెళ్లే మార్గాలను అధికారికంగా గుర్తించి సరిహద్దులు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలు ఉన్నట్లు అధికారుల పరిశీలనలో నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం వాటిని తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువుల సరిహద్దుల్లో బౌండరీలు ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

## లక్ష స్కూళ్లను మూసేశారు

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ :** విద్యార్థులే దేశ భవిష్యత్తు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే.. విద్యార్థులు ప్రశ్నించవద్దని కోరుకునే ఒక 'వ్యవస్థ'.. దేశం మొత్తాన్ని తన గుప్పిట్లోకి తీసుకుందని ఆరోపించారు. ఆ వ్యవస్థను ప్రశ్నిస్తున్న వారిని కొంతమంది గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో నిర్వహించిన 'ఛాత్రోకీ గూంజ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సోషల్ మీడియా సహా అన్నింటినీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నియంత్రిస్తున్నారని, నిఘా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురితో ఆయన మాట్లాడారు. ఎంపీపీఎస్సీలో అక్రమాలను ప్రశ్నిస్తే తమపై కేసు నమోదు చేసి జైలుకు పంపారని దేవాస్‌కు చెందిన ఓ విద్యార్థి పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నియామక పరీక్షలకు సంబంధించిన 13 శాతం కోటాను నిలిపివేసిన అంశాన్ని పలువురు లేవనెత్తారు.



## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు

**రౌడీషీటర్లకు ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు హెచ్చరిక**

**ఇల్లందు,నేడు న్యూస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్ లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ వెంకన్నబాబు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఎవరైనా బెదిరింపులు, దాడులు, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. శాంతిభద్రత లకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని డీఎస్పీ వెంకన్నబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## సంస్కార్ స్కూల్ గణేష్ నిమజ్జనం

**మేడ్చల్, నేడు న్యూస్:** మేడ్చల్‌లోని సంస్కార్ స్కూల్‌లోని గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణేష్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. విద్యార్థులు భక్తి పాటలు, గణపతి నామస్మరణతో ఉత్సాహంగా పాల్గొనడంతో పరిసర ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. పలువురు తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రత్యేక ఏర్పాట్లు నిమజ్జన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టారు.



## భూలక్ష్మీనగర్‌లో నవరాత్రి ఉత్సవాలు

**అన్న ప్రసాద వితరణ చేసిన మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్**

**మేడిపల్లి, నేడు న్యూస్:** పర్వతాపూర్ భూలక్ష్మి నగర్ లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణలో పాల్గొని పలువురికి అన్న ప్రసాదాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష కార్యదర్శులు కాలనీవాసులు, పుర ప్రముఖులు, మహిళలు, బి.ఎస్.కే.జీ యువసేన పాల్గొన్నారు.



## కుషాయిగూడలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**లబ్ధిదారులకు కార్డులు అందజేసిన మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్**

**కుషాయిగూడ, నేడు న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ ద్వారా జారీ చేసిన కొత్త రేషన్ కార్డులను కుషాయిగూడ డివిజన్ పరిధిలో లబ్ధిదారులకు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డుల ద్వారా లభించే ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. రేషన్ కార్డు ద్వారా ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వివిధ సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత/ఆసరా పెన్షన్, రైతు భరోసా, ఇందిరమ్మ భీమా వంటి పథకాల ప్రయోజనాలకు రేషన్ కార్డు సంబంధిత అర్హతల్లో ఉపయోగపడుతుందని వివరించారు. కొత్త రేషన్ కార్డులను ఆధునిక స్మార్ట్ కార్డు తరహాలో అందిస్తున్నట్లు, రేషన్ పొందడంతో పాటు ప్రభుత్వ సేవలు, ఇతర అవసరాల్లో గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు.

# చలసాని హిల్స్‌లో పరమేశ్వర్ రెడ్డి విస్తృత పర్యటన

- భూగర్భ డ్రైనేజీ, నీటి సరఫరా పనులకు రూ.36 లక్షల నిధులు.. అంతర్గత రోడ్లకు కూడా నిధులు మంజూరు చేస్తామని హామీ



**కాప్రా, నేడు న్యూస్:** కాప్రా డివిజన్ పరిధిలోని చలసాని హిల్స్‌లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా పనులకు రూ. 36 లక్షల నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను కాలనీ వాసులకు అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నా యని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజక వర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. కాలనీవాసుల వినతి మేరకు అంతర్గత రోడ్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, పావని రెడ్డి, మల్లారెడ్డి, సీతారామ్ రెడ్డి, కొత్త అంజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దండ్ల మురళి, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, డైరెక్టర్ పూర్ణ యాదవ్, మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ అజీజ్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి, వంపుగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుప్ రాజు (టిల్లు యాదవ్), కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కౌకుంట్ల ప్రకాష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూపాల్ రెడ్డి, రాకేష్ యాదవ్, రిజ్వాన్ ఖాన్, శ్రీకాంత్ గౌడ్, తోటకూర శ్రీకాంత్, డి. సతీష్ యాదవ్, సి. సత్యనారాయణ, జగదీష్ గౌడ్, గుణశేఖర్, అల్లం సతీష్ యాదవ్, కే. రాజు, నాగరాజు యాదవ్, రాజాశీలన్, శివకుమార్, సిద్ధిఖ్, మహిళా నాయకులు జ్యోతి, లక్ష్మీ, స్వర్ణలత, యువజన కాంగ్రెస్ నాయకులు మనోజ్ కుమార్, పవన్ కళ్యాణ్, విజయ్ పాల్గొన్నారు.

# ఆర్‌కే పురం ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలి

- పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలి..
- అధికారులకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం



**మల్కాజ్‌గిరి, నేడు న్యూస్:** ఆర్‌కే పురం ఫ్లైఓవర్ ఆర్‌ఓబీ/ఆర్‌యూబీ ప్రాజెక్టు పనుల పురోగతిపై మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో చేపట్టాల్సిన పనులు, ఇప్పటివరకు జరిగిన పురోగతి, పెండింగ్ అంశాలు, ప్రభావిత ఆస్తుల యజమానులకు సంబంధించిన ప్రక్రియలపై అధికారులు కమిషనర్‌కు వివరించారు. ప్రభావిత ఆస్తుల యజమానులతో టీఆర్‌డి దరఖాస్తులు, సమ్మతి, ఇతర సంబంధిత ప్రక్రియలపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, లీగల్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టు పురోగతికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ప్రభావిత ఆస్తుల యజమానులతో అవసరమైన చర్చలు నిర్వహించి, సమ్మతి, టీఆర్‌డి దరఖాస్తుల ప్రక్రియలను నిబంధనల ప్రకారం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను అంశాల వారీగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌కే పురం ఫ్లైఓవర్ ఆర్‌ఓబీ/ఆర్‌యూబీ ప్రాజెక్టు పూర్తయితే ట్రాఫిక్ రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ గణనీయమైన పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ రావుతో పాటు టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, లీగల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆర్చ్ నిర్మాణ పనులు ప్రారంభం

- కాప్రా గ్రామంలో స్వాగత తోరణం నూతన నిర్మాణానికి శ్రీకారం.. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ధర్మకర్తల మండలికి అభినందనలు



**కాప్రా, నేడు న్యూస్:** కాప్రా గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ స్వాగత తోరణం (ఆర్చ్) నూతన నిర్మాణ పనులను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ఏర్పాటు చేసిన ఆలయ ధర్మకర్తల మండలి ఆలయ అభివృద్ధికి కృషి చేసి, ఆలయ ప్రాంగణాన్ని ఆధునీకరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇందుకు కృషి చేసిన ధర్మకర్తల మండలి చైర్మన్ పొట్టు బాబురావు, సభ్యులు పడమటి మల్లారెడ్డి, ఓర్ల శ్రీధర్ రెడ్డి, పబ్బతి నరేందర్ గౌడ్, ఉప్పల వినోద్ కుమార్, గుడ్డి సత్యనారాయణలను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణమాచార్యులు, ప్రధానార్చకుడు రవిశర్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ దండెంల మురళి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, డైరెక్టర్ పూర్ణ యాదవ్, మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, అనుప్ రాజు (టిల్లు యాదవ్), కౌకుంట్ల ప్రకాష్ రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి, అజీజ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

**కారేపల్లి, నేడు న్యూస్:** పోలంపల్లి తండా గ్రామపంచాయతీ పరిధిలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు పెన్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులపై శనివారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఎంపీడీవో పద్మ, పోలంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ హేమలత బాలాజీ, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు గ్రామ శాఖ అధ్యక్షుడు గూగులోత్ నవీన్ నాయక్ గ్రామాల్లో పర్యటించి దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 22 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉండగా, రెండు దరఖాస్తులకు సంబంధించిన వారు అందుబాటులో లేకపోవడంతో మిగిలిన 20 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఫిజికల్ వెరిఫికేషన్ చేశారు. దరఖాస్తుదారుల అర్హత, కుటుంబ పరిస్థితులు, ఇతర వివరాలను అధికారులు, కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా చర్యలు తీసుకునేందుకు దరఖాస్తుల పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమలత బాలాజీతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో గణనాథుడికి ప్రత్యేక పూజలు

**భక్తిశ్రద్ధలతో పూజలు.. పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ**

**కాప్రా, నేడు న్యూస్:** కుషాయిగూడ డివిజన్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఐదో రోజు శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దన్‌పాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎన్. మహేష్ గౌడ్, గంప కృష్ణ, ఆకుల పృథ్వీ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడి సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జె. సుధాకర్, కార్యదర్శి అఖిల్, మాజీ అధ్యక్షుడు పరమేష్ చారి, కమిటీ సభ్యులు కనకయ్య, పి. శ్రీనివాస్ గౌడ్, రాజేష్, మునీర్, సంతోష్, శ్రీనివాస్, రాజయ్య, లింగస్వామి, పాండు, ప్రవీణ్, దామోదర్, మల్లేష్, మాదేశ్, శివ, కిరణ్, కృష్ణ, శ్రీధర్, అనసూయ, అనిత, పద్మ, సుఖన్యతో పాటు మహిళలు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



## మల్లికార్జున్ నగర్‌లో ఘనంగా గణేష్ పూజలు

**గణనాథుడిని దర్శించుకున్న వేముల రాజు, వేముల రమేష్ దంపతులు**


**మల్లాపూర్, నేడు న్యూస్:** శక్తిసాయినగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల రాజు దంపతులు, వేముల రమేష్ దంపతులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని గణనాథుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



## మౌలాలి, మల్కాజ్‌గిరి సర్కిళ్లలో కమిషనర్ విస్తృత క్షేత్రస్థాయి పరిశీలన

**స్ట్రీట్ లైట్లు, రోడ్డు నిర్వహణ, గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష**

**మల్కాజ్‌గిరి, నేడు న్యూస్:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మౌలాలి, మల్కాజ్‌గిరి సర్కిళ్లలో విస్తృత క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. మౌలాలి వార్డులో రోడ్డు ప్యాచ్ పనులకు వినియోగించే షెల్ మ్యాక్ బ్యాగుల నిల్వ, కొత్త స్ట్రీట్ లైట్ల స్టాక్, ఇతర పరికరాల నిర్వహణను కమిషనర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న సామగ్రిని అవసరమైన ప్రాంతాల్లో సకాలంలో వినియోగించాలని, పరికరాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వర నగర్‌లో స్థానిక ప్రజలతో మాట్లాడిన కమిషనర్ రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్లు లేక ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రజల భద్రత, సౌకర్యం కోసం అవసరమైన ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీన్ దయాల్ నగర్ రోడ్డులో కొనసాగుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, బకెట్ ల్యాడర్ కార్యకలాపాలను పరిశీలించారు. ప్రధాన రహదారులు, రోడ్డు మార్జిన్లలో ట్రాఫిక్, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే కొమ్మలను సకాలంలో తొలగించాలని సూచించారు. అనంతరం మల్కాజ్‌గిరి సర్కిల్‌లోని బండ చెరువు బేబీ పాండ్‌ను పరిశీలించి గణేష్ నిమజ్జనానికి కల్పించిన ఏర్పాట్లు, సౌకర్యాలను సమీక్షించారు. నిమజ్జన సమయంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల భద్రత, సజావు రాకపోకలు, గుంపుల నిర్వహణ, భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో డీసీ బాలకృష్ణ ప్రసాద్, ఎస్‌ఈ లక్ష్మణ్, డీఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్, యూబీడీ, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ అధికారులు పాల్గొన్నారు.



## గోపన్‌పల్లిలో ప్రమాదకర భవనంపై కేసు

**భవన యజమాని లక్ష్మి తదితరులపై గచ్చిబౌలి పోలీసుల చర్యలు**

**శేరిలింగంపల్లి ,నేడు న్యూస్ :** గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ప్రమాదకరంగా ఒరిగిన జీం4 భవనంపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వే నంబర్ 124/డీలోని ప్లాట్ నంబర్ 31/పీలో నిర్మించిన ఈ భవనానికి పగుళ్లు ఏర్పడి ఒకవైపునకు ఒరిగిపోవడంతో ప్రజల భద్రతకు ముప్పుగా మారింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాన్ని పరిశీలించి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా భవనంలోని నివాసితులను ఖాళీ చేయించి, చుట్టుపక్కల ప్రజలను అప్రమత్తం చేశారు. భవనం సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని సూచించారు. అధికారుల ఫిర్యాదు మేరకు భవన నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు వహిస్తున్న విశ్వనాథపల్లి లక్ష్మి తదితరులపై గచ్చిబౌలి పోలీసులు 125, 290 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భవన నిర్మాణంలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజల భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



## బీఆర్ రెడ్డి నగర్‌లో ఘనంగా మహా అన్నదానం

**భక్తిశ్రద్ధలతో గణేశుడికి ప్రత్యేక పూజలు.. కాలనీవాసులకు అన్నప్రసాదం**

**కుషాయిగూడ, నేడు న్యూస్:** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని బీఆర్ రెడ్డి నగర్ కాలనీ సొసైటీ భవనంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి గీతాలతో వేడుకలు జరిపారు. బీఆర్ రెడ్డి నగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బి. సాంబశివరెడ్డి మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో కాలనీవాసులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం కాలనీవాసులందరికీ మహా అన్నదానం నిర్వహించారు. అదే కాలనీకి చెందిన ప్రజా గాయకుడు భక్తి గీతాలను ఆలపించి భక్తులను అలరించారు. కార్యక్రమంలో ఆర్. బిక్షపతి రెడ్డి, వెంకట్ రాములు, జగన్మోహన్ రావు, కిషన్ సింగ్, రాంరెడ్డి, కేవీఎస్-ఎల్ నరసింహారావు, సంతోష్, వరద రెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## గణపతి మండపాన్ని సందర్శించిన సినీ నిర్మాత దిల్ రాజు

**సికింద్రాబాద్,నేడు న్యూస్:** సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని టకార బస్తీలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అశోక యువజన సంఘం మహా గణపతి మండపాన్ని ప్రముఖ సినీ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.వినాయక చవితి ఉత్సవాలను పద్మారావు గౌడ్ కుటుంబం ప్రతి ఏడాది విభిన్నంగా నిర్వహిస్తూ భక్తులను ఆకట్టుకుంటుందని దిల్ రాజు పేర్కొన్నారు.హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలకు ఇలాంటి ఉత్సవాలు దర్పణంగా నిలుస్తాయని పద్మారావు గౌడ్ అన్నారు.కార్యక్రమంలో యువ నేత కిశోర్ కుమార్తో పాటు అశోక యువజన సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## యూపీఐపై చార్జీల భారం వద్దు.. సామాన్యులపై పెనుభారం మోపొద్దు

**ఖమ్మం డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్**



**కారేపల్లి, నేడు న్యూస్:** యూపీఐ చెల్లింపులపై చార్జీల పేరుతో సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం మోపే విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఖమ్మం డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్ డిమాండ్ చేశారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు యూపీఐ లావాదేవీలపై చార్జీల విధానం తీసుకురావడం సరికాదన్నారు. కారేపల్లి మండల ప్రజలు, చిన్న వ్యాపారులు, చిరు దుకాణదారులు నిత్యం ఫోన్‌పే, గూగుల్‌పే తదితర యూపీఐ చెల్లింపు విధానాలను వినియోగిస్తున్నారని తెలిపారు. డిజిటల్ చెల్లింపులు ప్రజల రోజువారీ జీవితంలో భాగమైన నేపథ్యంలో అదనపు చార్జీలు విధిస్తే చిరు వ్యాపారులపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ లావాదేవీలను విస్తృతంగా ప్రోత్సహించిందని, దీంతో ప్రజలు కూడా యూపీఐ చెల్లింపుల వైపు మళ్లారని గుర్తుచేశారు. ఇప్పుడు డిజిటల్ లావాదేవీలపై చార్జీల విధానం తీసుకురావడం వల్ల సామాన్య ప్రజలు, వ్యాపారుల్లో ఆందోళన నెలకొంటోందన్నారు. సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యూపీఐ చెల్లింపులపై అదనపు భారం లేకుండా చూడాలని కోరారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, చిరు వ్యాపా రులపై ఆర్థిక భారం పడకుండా యూపీఐ చార్జీల విధానాన్ని తక్షణమే ఉపసంహ రించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ధరావత్ బద్రు నాయక్ డిమాండ్ చేశారు.



## గిరిజనుల అభివృద్ధికి ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి : భూక్యా వీరభద్రం

**కారేపల్లి, నేడు న్యూస్:** ఖమ్మం కేంద్రంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏ ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కారేపల్లి మండల కేంద్రంలోని భాగం రామ నరసయ్య భవన్‌లో శనివారం తెలంగాణ గిరిజన సంఘం మండల కమిటీ విస్తృత సమావేశం మండల అధ్యక్షుడు అజ్మీరా శోభన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు సంఘం ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించి తండా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్‌ను సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా రంజిత్ నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అక్టోబర్ 1న మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కారేపల్లి మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేసి, మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి, ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోతు బన్సీలాల్ నాయక్, మండల నాయకులు మాలోతు బాలు నాయక్, బానోతు శ్రీనివాస్ నాయక్, భూక్యా రాంబాబు నాయక్, భూక్యా రమేష్, అజ్మీరా శ్రీను, బానోతు కిషన్ నాయక్, ధర్మశోత్ సూర్య నాయక్, భూక్యా పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పివిఎం బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం

**జవహర్‌నగర్, నేడు న్యూస్ :** గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కారంలోని అమ్మవారి ఆలయంలో పీ.వీ.యం బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు నూరుద్దీన్ ఫారూఖ్, పి.వి.యం. శ్రీనివాస్, రమేష్, జగన్, ప్రవీణ్ లు పాల్గొన్నారు. అనంతరం పీవీయం బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం

**నృత్యాలు, భజనలతో గణపతిని ఘనంగా వీడ్కోలు పలికిన విద్యార్థులు, ఉపాధ్యాయులు**





**మేడ్చల్, నేడున్యూస్:** మేడ్చల్ డివిజన్ పరిధిలోని అత్వెల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో గత ఐదు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడికి శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు మాట్లాడుతూ, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. పండుగల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, సామాజిక బాధ్యత, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావుతో పాటు ఉపాధ్యాయులు గడప నవీన్, పద్మలత, వసీమ్, రంగారావు, మంజుల, రాంబాబు, సరూప రాణి, ప్రభాకర్, విజయలక్ష్మి, సోనీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమన్వయంతో గణపతి నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రజలకు మేలు చేయడమే కాంగ్రెస్ నైజం

- ఎమ్మెల్యే శ్రీగణేష్
- కంటోన్మెంట్ క్యాంప్ ఆఫీస్‌లో 45 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**సికింద్రాబాద్, నేడు న్యూస్ :** ప్రజలకు సంక్షేమాన్ని అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను అడ్డుకోవడమే బీఆర్ఎస్ నైజమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో నియోజకవర్గానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల కోసం లబ్ధిదారులు ఏడాది వరకు వేచి చూడాల్సి వచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 3--4 నెలల్లోనే చెక్కులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఎమ్మార్వోలు దరఖాస్తులను వేగంగా పరిశీలించి ప్రభుత్వానికి పంపడం వల్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతోందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కలగడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తుందనే ఉద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు కోర్టులను ఆశ్రయించారని శ్రీగణేష్ ఆరోపించారు. కోర్టు పరిణామాల కారణంగా చెక్కుల పంపిణీలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ హయాంలో భూముల వ్యవహారాలపై అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేదలు, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని శ్రీగణేష్ తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, సన్నబియ్యం అందించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా పేదలకు, ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

- పంక్చర్ అయిన వాహనాన్ని వెనుక నుంచి దూసుకొచ్చి ఢీ కొట్టిన టాటా ట్రక్కు
- ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- ప్రమాదం అనంతరం ట్రక్కు డ్రైవర్ పరారీ



**మేడ్చల్, నేడు న్యూస్:** శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్ పై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పంక్చర్ అయిన వాహనాన్ని రిపేర్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన టాటా ట్రక్ ఢీకొట్టడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం అనంతరం టాటా ట్రక్ డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి సుమారు 12:35 గంటల సమయంలో ఈ ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందింది. ఫిర్యాదుదారు మహ్మద్ హుస్సేన్ సోదరుడు ఇస్మాయిల్ హుస్సేన్ (26)తో పాటు కూలీలు ఇబ్రహీం, రింకు, అశోక్, భీమ్ షాలు టీఎస్ 09 యుడి 3611 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో స్క్రాప్ లోడ్‌తో చేగుంట నుంచి ఓఆర్ఆర్ మీదుగా కీసర వైపు బయలుదేరారు. వాహనం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్-06 వద్ద నుంచి బయటకు వచ్చి షామీర్‌పేట ఓఆర్ఆర్ పై వెళ్తుండగా, లియోనియా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని దాటిన అనంతరం సుమారు 300 మీటర్ల దూరంలో వాహనం కుడివైపు వెనుక టైర్ పంక్చర్ అయింది. దీంతో డ్రైవర్ వాహనాన్ని ఓఆర్ఆర్ ఎమర్జెన్సీ లేన్‌లో నిలిపివేశారు. టైర్‌ను మార్చేందుకు రింకు, ఇబ్రహీం జాకీ రాడ్ సహాయంతో పంక్చర్ అయిన టైర్‌ను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇస్మాయిల్ హుస్సేన్ టార్చ్ లైట్ పట్టుకుని వాహనం కింద పని చేస్తున్నారు. అదే సమయంలో అశోక్, భీమ్ షా వాహనానికి సపోర్టుగా పెట్టేందుకు రాళ్లు తీసుకురావడానికి వెళ్లారు. ఇంతలో టీఎస్ 15 యుడి 8932 నంబర్ గల టాటా ట్రక్ వెనుక నుంచి వేగంగా వచ్చి ఎమర్జెన్సీ లేన్‌లో నిలిపి ఉన్న అశోక్ లేలాండ్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రింకు, ఇబ్రహీం, ఇస్మాయిల్ హుస్సేన్ తీవ్ర రక్తస్రావంతో గాయపడ్డారు. రింకు, ఇస్మాయిల్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇబ్రహీంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఫిర్యాదుదారు మహ్మద్ హుస్సేన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ రింకు, ఇస్మాయిల్ హుస్సేన్ తీవ్ర రక్తస్రావంతో రోడ్డుపై మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదం అనంతరం టాటా ట్రక్ డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలంలో ఉన్న భీమ్ షా తెలిపిన వివరాల ప్రకారం, డ్రైవర్ తన పేరు నాగరాజు, మియాపూర్ నివాసిగా చెప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రక్ డ్రైవర్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనాల వేగం తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- కేంద్రం మంజూరు చేసిన ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం తమ పథకంగా ప్రచారం చేస్తోంది
- ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టిన బిజెపి నాయకులు జాకట ప్రేమ్ దాస్



**మేడ్చల్, నేడు న్యూస్:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న నిధులు, ఇళ్ల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై మేడ్చల్ బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్ దాస్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' అనే పేరు పెట్టి తమ పథకంగా ప్రచారం చేసుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా జాకట ప్రేమ్ దాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసరమైన నిధులను విడుదల చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు సకాలంలో రావడం లేదంటూ విమర్శలు చేస్తోందని అన్నారు. కేంద్రం రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, అయితే వాటిని రాష్ట్ర ప్రభుత్వం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరుతో 'ఇందిరమ్మ ఇళ్లు'గా ప్రచారం చేస్తోందని ఆయన అన్నారు. ఇళ్ల పథకానికి సంబంధించి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎంత, నిధులు ఏ విధంగా విడుదలవుతున్నాయి అనే అంశాలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయన కోరారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే సామాన్య ప్రజల నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని జాకట ప్రేమ్ దాస్ తెలిపారు. అలాగే లక్కీ డ్రా పేరుతో లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, ఈ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, వారి అనుచరులకు ప్రయోజనం కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఆయన అన్నారు. ఇళ్ల పథకానికి సంబంధించిన దరఖాస్తుల సంఖ్య, లబ్ధిదారుల ఎంపిక ప్రమాణాలు, నిధుల విడుదల వివరాలు, ఇళ్ల మంజూరు ప్రక్రియ వంటి అంశాలను బహిరంగంగా వెల్లడిస్తే ప్రజల్లో ఉన్న అనుమానాలకు స్పష్టత వస్తుందని ఆయన అన్నారు.



## మేడ్చల్ బస్టాండ్ ఆవరణలో డ్రైనేజీ సమస్య

- మురుగునీటితో దుర్వాసన.. అపరిశుభ్ర వాతావరణం
- ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు

**మేడ్చల్, నేడు న్యూస్:** మేడ్చల్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతున్నట్లు ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోకి డ్రైనేజీ నీరు చేరి నిలిచిపోతుండటంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ఉమానగర్, చంద్రనగర్, రాయల్ ఫంక్షన్ హాల్, సెయింట్స్ స్కూల్, ఆర్ వెంచర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు బస్టాండ్ పరిసర ప్రాంతాలకు చేరుతున్నట్లు స్థానికులు, ప్రయాణికులు, ఉద్యోగులు చెబుతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం లేదా ఉన్న వ్యవస్థ సక్రమంగా పని చేయకపోవడం వల్ల మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడక్కడే నిలిచిపోతున్న పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొంటున్నారు.

### దుర్వాసనతో ప్రయాణికుల ఇబ్బందులు

మేడ్చల్ బస్టాండ్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు బస్టాండ్‌లో కొంత సమయం వేచి ఉండాల్సి ఉంటుంది. అయితే బస్టాండ్ పరిసరాల్లో మురుగునీరు నిలిచిపోవడం, దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు మురుగునీరు నిలిచిన ప్రాంతాలను దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఉద్యోగులకూ తప్పని ఇబ్బందులు

బస్టాండ్‌లో విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులు కూడా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ప్రతిరోజూ ఇదే వాతావరణంలో విధులు నిర్వహించాల్సి రావడంతో అసౌకర్యంగా ఉంటోందని వారు పేర్కొంటు న్నారు. మురుగునీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉండటంతో పారిశుధ్యంపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది.



## గణపతి మండపాల వద్ద భక్తి పారవస్యం

**మేడ్చల్ మారుతి యూత్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం**

**మేడ్చల్, నేడున్యూస్:** మేడ్చల్ డివిజన్ పరిధిలోని మారుతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి భవాని రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు భోజనం వడ్డిస్తూ అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్న వితరణ చేయడం సంతోషకరమైన విషయమని నిర్వాహకులు పేర్కొన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎర్ర విజయరావు, ఓం రాజ్‌తో పాటు మారుతి యూత్ అసోసియేషన్ సభ్యులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్లను పాల్గొన్న వారు అభినందించారు. యువత, ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## గిరిజన యువతకు న్యాయం చేయాలి

**సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**

**కారేపల్లి, నేడు న్యూస్:** గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక యువతకు పోలీస్ ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించేందుకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, పలువురు గిరిజన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న స్థానిక యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. పోలీస్ ఉద్యోగాల్లో స్థానిక గిరిజన యువతకు అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించడంతో పాటు, స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న యువత పోలీస్ శాఖలో భాగస్వాములు అవుతారని తెలిపారు. దీంతో ప్రజలకు, పోలీస్ వ్యవస్థకు మధ్య మరింత సాన్నిహిత్యం, విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 75 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన రాజ్యాంగ, చట్టపరమైన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. గిరిజనుల హక్కులు, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన యువతకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటారన్న నమ్మకం ఉందని మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# వేడుక కావాలి.. విషాదం కాదు!

## గణపతి నిమజ్జన వేళ అప్రమత్తతే రక్ష
### తగు జాగ్రత్తలు తీసుకుంటే నిమజ్జనం సుఖాంతం

**వినాయక చవితి అంటే భక్తి.. ఆనందం.. సందడి. పది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథుడికి నిమజ్జనంతో వీడ్కోలు పలకడం ఆనవాయితీ. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. అయితే చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఈ సంబరాలను విషాదంగా మార్చే ప్రమాదం ఉంది.**



**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాలో ఇటీవల నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలచివేసింది. పండుగ పూట ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఇలాంటి ఘటనలు నిమజ్జన వేళ భద్రతపై మరింత అప్రమత్తత అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

### ఉత్సాహం ఉండాలి.. విచక్షణ కోల్పోవద్దు

నిమజ్జన శోభాయాత్రలో యువత ఉత్సాహంగా పాల్గొనడం సహజం. కానీ డీజేల మోత, అధిక శబ్దాల మధ్య విచక్షణ కోల్పోవడం ప్రమాదాలకు దారితీస్తోంది. అలాగే అధిక సౌండ్ లకు కొందరు అనారోగ్యానికి గురికావడం కూడా తరచుగా జారుతుంది అలాంటి వారి విషయాల్లో జాగ్రత అవసరం అలాగే వాహనాలపైకి ఎక్కడం, కదులుతున్న ట్రాక్టర్లు, లారీలను అంటిపెట్టుకుని ప్రయాణించడం, ప్రమాదకరంగా నృత్యాలు చేయడం వంటివి చేయకూడదు. క్షణిక ఉత్సాహం జీవితాంతం పశ్చాత్తాపాన్ని మిగల్చవచ్చు. సంబరం ఎంత ముఖ్యమో.. సంయమనం అంతకంటే ముఖ్యం.

### విద్యుత్ తీగలతో జాగ్రత్త

భారీ విగ్రహాల ఊరేగింపులో విద్యుత్ తీగల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. విగ్రహం ఎత్తు, వాహనం పరిమాణం, మార్గంలోని విద్యుత్ లైన్లను ముందుగానే పరిశీలించాలి. అవసరమైన చోట విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో సరఫరాను నిలిపివేసిన తర్వాతే ఊరేగింపును కొనసాగించాలి. విద్యుత్ తీగ తగిలితే జరిగే ప్రమాదం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది.

### విగ్రహం నిమజ్జనం కావాలి.. మనిషి కాదు

చెరువులు, కుంటలు, నదుల్లో నీటి లోతు ఎక్కడెంత ఉంటుందో తెలియదు. అడుగున గుంతలు, బురద, జారుడు నేల వంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఈత వచ్చినా తెలియని నీటిలోకి దిగడం సాహసం కాదు.. నిర్లక్ష్యం. ముఖ్యంగా పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా వదిలేయకూడదు. రక్షణ సిబ్బంది సూచనలు తప్పక పాటించాలి. నిమజ్జనం కోసం విగ్రహం నీటిలోకి వెళ్లాలి.. మనుషులు కాదు.

### భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. బారికేడ్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, వైద్య బృందాలు, తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలి. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రజలు కూడా నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలి. బారికేడ్లు దాటడం, నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లడం, మద్యం సేవించి నీటిలోకి దిగడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. వినాయక చవితి ప్రతి ఇంటా వెలుగులు నింపే పండుగ. నిమజ్జనం అనంతరం ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరినప్పుడే ఆ వేడుకకు నిజమైన పరిపూర్ణత. విఘ్నాలను తొలగించే గణపతికి వీడ్కోలు పలికే వేళ.. మన అజాగ్రత్తే విఘ్నంగా మారకూడదు. వినాయకుడికి వీడ్కోలు పలుకుదాం.. ప్రాణాలకు కాదు. వేడుక ముగిసిన వేళ ప్రతి ఇంట్లోనూ నవ్వులు వెలగాలి.. కన్నీళ్లు కాదు.



– జి. అజయ్ కుమార్



## విఘ్నేశ్వరుడి సేవలో మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి

**శేరిలింగంపల్లి, నేడు న్యూస్ :** శంకర్‌నగర్ ఫేజ్–1లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక శోభ మధ్య వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహిళలు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల ప్రసాదాలు, పిండివంటలను నైవేద్యంగా సమర్పించి మహామంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. కాలనీలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఐక్యత, సౌభ్రాతృత్వానికి నిదర్శనమన్నారు. వేడుకల్లో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వయంగా తయారుచేసిన వివిధ రకాల నైవేద్యాలను గణనాథుడికి సమర్పించారు.




## నవ కుంకుమలతో సహస్రనామార్చన
### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**మేడ్చల్, నేడు న్యూస్:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో నిర్వహించిన "నవ కుంకుమలతో సహస్రనామార్చన" ఆధ్యాత్మిక కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని, ఆయన నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. దేశ ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యం, సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, నవ కుంకుమలతో సహస్రనామార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమ ప్రాంగణం వేద మంత్రోచ్చారణలు, భక్తిగీతాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారత్ అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. నవ కుంకుమలతో నిర్వహించిన సహస్రనామార్చనలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ భక్తులు ఆయన ఆయురారోగ్యాలతో దేశ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, నవజీవన్ రెడ్డి, కొత్త రవీందర్ రెడ్డి, కిరణ్ రెడ్డి, ఢిల్లీ వెంకటేష్‌తో పాటు ఆధ్యాత్మిక ప్రముఖులు, కార్యక్రమ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.



## పోషణే ప్రగతికి పునాది
### ఆరోగ్యకర సమాజ నిర్మాణం అందరి బాధ్యత

**కూకట్ పల్లి, నేడు న్యూస్:** హైదర్ నగర్ సెక్టార్ పరిధిలోని రిక్షాపులర్స్ కాలనీ–1 అంగన్‌వాడీ కేంద్రంలో 9వ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ సిడిపిఓ రేణుక మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యతను వివరించడంతో పాటు, తల్లులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శిశు సంరక్షణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాధవి, ప్లాన్ ఇండియా యశోద ఎస్ బి వి ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అధికారులు సూచిస్తున్నారు.



## హైదర్‌నగర్‌లో డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు హబీబ్

**కూకట్ పల్లి, నేడు న్యూస్:** హైదర్ నగర్ లోని రేషన్ షాప్ దగ్గర రేషన్ డిజిటల్ కార్డులను పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హబీబ్ భాయ్ పాల్గొని డిజిటల్ కార్డులను పంపిణీ చేసి ఎన్నో సంవత్సరాల నుంచి రేషన్ కార్డు లేని వారందరికీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి పేద ప్రజలకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందాలని ఆలోచనతో కొన్ని లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగినది, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈ డిజిటల్ రేషన్ కార్డుని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ యాసిన్, పోతుల రాజేందర్ పటేల్ , సత్యనారాయణ, షరీఫ్, ఫసి, తదితరులు పాల్గొన్నారు..

## 1000 మందికి అన్న ప్రసాద వితరణ

**శేరిలింగంపల్లి నేడు, న్యూస్ :** శేరిలింగంపల్లి ఆదర్శ్ నగర్ యూత్ అసోసియేషన్ గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా చింతకింది గోవర్ధన్ గౌడ్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించడం అభినందించదగ్గ విషయమని





అన్నారు. అనంతరం చింతకింది గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ పేరిట అన్న ప్రసాద వితరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆదర్శ్ నగర్ కాలనీ యూత్, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్, ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపాల వద్ద దాదాపు 6 వెల మందికి పైగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరావు, నాగేశ్వరరావు, రంగా గౌడ్, బెజగం కేశవులు, పుట్ట వినయకుమార్ గౌడ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్ నాయి, రవీందర్ రెడ్డి, అల్లూరయ్య, శ్రీనివాసరావు, అరుణ్ గౌడ్, డాకయ్య గౌడ్, కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ నేషనల్ కాన్ఫరెన్స్‌కు భారీగా తరలిరావాలి

- 29 రాష్ట్రాల నుంచి బీసీ ప్రతినిధుల హాజరు
- పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి రావాలి: చింత రమేష్ గౌడ్

**మేడ్చల్, నేడు న్యూస్:** బీసీల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై జాతీయ స్థాయిలో చర్చించేందుకు నిర్వహిస్తున్న ఓబీసీ నేషనల్ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, బీసీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని బీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని బేగంపేట హరిత ప్లాజాలో ఈ నెల 20న ఓబీసీ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు రమేష్ గౌడ్ తెలిపారు. ఈ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి బీసీ ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులతో బీసీలకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా హాజరుకానున్నారని రమేష్ గౌడ్ తెలిపారు. బీసీల హక్కులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా బీసీలను ఒకే వేదికపైకి తీసుకురావడమే కాన్ఫరెన్స్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఐక్య కార్యాచరణ అవసరమని రమేష్ గౌడ్ అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో బీసీలు




ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమాలోచనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలంతా రాజకీయ పార్టీలకు అతీతంగా ఒకే వేదికపైకి వచ్చి తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల ప్రయోజనాల కోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని బీసీ సంఘాలు, నాయకులు, కార్యకర్తలు, యువత, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో కాన్ఫరెన్స్‌కు హాజరై విజయవంతం చేయాలని చింత రమేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొనే ఈ మహాసభ బీసీల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించేందుకు వేదికగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలంతా ఐక్యతతో ముందుకు సాగితే తమ హక్కుల సాధన కోసం మరింత సమర్థవంతంగా కృషి చేయగలమని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.




## ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం
### మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్

**జవహర్‌నగర్, నేడు న్యూస్ :** కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని జవహర్ నగర్ మాజీ మేయర్ దొంత గాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. శనివారం బి జె ఆర్ నగర్ లోని మామిడి తోటలో స్మైల్ ఫౌండేషన్, యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ మేయర్ శాంతి ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే జవహర్ నగర్ పరిసర ప్రాంతాలలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె అన్నారు. ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ జబ్బులు, ఆర్థోపెడిక్ చిన్న పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉండి వైద్యపరీక్ష నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య శిబిరంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కొలిపాక సాయికిరణ్, కొలిపాక కళ్యాణి, స్మైల్ ఫౌండేషన్ సిహెచ్ఓ ఎండి సాదిక్, వైద్యులు గడ్డం రాజ్ కుమార్, జె. గౌతమి, మేడ శిరీష, స్టాఫ్ నర్సులు సంధ్యారాణి, సమియా, మానస రాజశేఖర్, పవిత్ర లు వైద్య శిబిరంలో వారి సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, నాయకులు కోటేష్ గౌడ్, మాట్ల వినయ్, మాట్ల శ్రీను, ఆనంద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**దేవరుప్పుల నేడు న్యూస్:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరుప్పుల మండల కేంద్రంలోని విద్యావరణం కేంద్రంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ఎంపికైన 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన నల్ల లలిత, శంకర్, శంకరయ్యలను సైతం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి యు. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో మేనక పౌడెల్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా డి. వెంకటేశ్వర్లు, పి. అరుణ, వై. రేఖ, వి. లక్ష్మణరావు, సి. హెచ్. నవీన్‌కుమార్, సి. హెచ్. శ్రీనివాస్, సి. హెచ్. రాధిక, వి. మోహన్, ఎం. లక్ష్మణ్‌జీ, కే. శైలజ, వి. శివలింగం, బి. పాండ్యా, సి. హెచ్. రమాదేవి, ఎం. పద్మారాణి, కే. భాగ్యలక్ష్మి, జి. అనిత, జి. పద్మాదేవి, పి. వీరారెడ్డి, డి. రామన్న, బి. మనోహర్, బి. పద్మ, ఆర్. స్వప్న, జే. కవితలను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘం బాధ్యులు గోలి తిరుపతిరెడ్డి, లకావత్ లాల్మా, సత్తయ్య, లక్ష్మణ్‌జీ, బుర్ర రమేష్, గోవర్ధన్‌రెడ్డి, శంకరయ్య, ఎంఆర్సీ సిబ్బంది గోలి రవీందర్‌రెడ్డి, మార్గం నరసింహులు, గుగులోతు రాంచందర్, యాకస్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రకుమార్, పి. వెంకన్న పాల్గొన్నారు.

# విజయ్ సున్నితమైన వ్యక్తి

## పెళ్లి తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదు : రష్మిక

విజయ్ దేవరకొండను పెళ్లాడిన తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదని నటి రష్మిక అన్నారు. కెరీర్ పతాకస్థాయిలో ఉన్నప్పుడు వివాహం చేసుకున్నా.. తన ప్రయాణం యథావిధిగానే సాగుతోందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు. "మేమిద్దరం కలిసే ఎదిగాం. తోటి నటులుగా మొదలై, బెస్ట్ ఫ్రెండ్స్‌గా మారి, ఇప్పుడు భాగస్వాములమయ్యాం. విజయ్ చాలా సున్నితమైన మనసున్న వ్యక్తి. సెట్‌లో పని పట్ల ఎంతో నిబద్ధతతో ఉండే ఆయన.. బయట చాలా ఆప్యాయంగా ఉంటాడు. పెళ్లికి ముందు.. ఆ తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదు. వరుస సినిమాలతో బిజీగా ఉండటం వల్ల రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతున్నా" అని రష్మిక పేర్కొన్నారు. "ఎప్పుడూ స్పాట్‌లైట్‌లో నిలబడటం అంటే.. ఎవరో తలపై తుపాకీ గురిపెట్టినట్లు అనిపిస్తుంది" అని స్టార్‌డమ్ తెచ్చే ఒత్తిడి గురించి ఆమె వివరించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. భర్త విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'రణబాలి' షూటింగ్ ఇటీవల పూర్తికాగా.. తను ప్రధాన పాత్రలో నటిస్తున్న మరో చిత్రం 'మైసా' చిత్రీకరణ చివరి దశలో ఉంది.. ఇక, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ' పేరుతో రూపొందుతున్న ఈ బయోపిక్‌లో రష్మిక ప్రధానపాత్రలో కనిపించనున్నారు.



# ముద్దు సీన్ కవర్ చేసేయండి అని అడుగుతున్నారు : రాధికా ఆప్టే

గతంలో తాను చేసిన బోల్డ్ పాత్రల వల్ల, కథలో అవసరం లేకపోయినా తనతో ముద్దు సీన్లు చేయించాలని కొందరు దర్శకనిర్మాతలు యత్నించారని బాలీవుడ్ నటి రాధికా ఆప్టే అన్నారు. తనను కేవలం లోదుస్తులతో ఓ యాక్షన్ సన్నివేశంలో నటించాలని అడిగారని ఆమె గుర్తుచేసుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రాధికా.. సన్నివేశాల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కెరీర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో నగ్నంగా నటించాను. అది చూసి 'ఆమె సులభంగా అంగీకరిస్తుందిలే' అని కొందరు అనుకుంటున్నారు. కానీ, ఇప్పుడు నేను అలాంటివి చేయడంలేదు. మూవీలో సన్నిహిత సన్నివేశాలు ఎందుకు అవసరమో స్పష్టమైన కారణం చెప్పాలని అడుగుతున్నాను. కొందరైతే 'ఓ 15 సెకన్లు ఏదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి' అని అడుగుతున్నారు. అది వింటే నాకు నవ్వొస్తుంది" అని రాధికా పేర్కొన్నారు. "ఒక సినిమా సెట్‌లో యాక్షన్ సన్నివేశం కోసం షర్టు గుండీలు విప్పేసి నటించగలరా? అని అడిగారు. యాక్షన్ సీన్ అంటే వేగంగా కదులుతాం కాబట్టి కుదరదని చెప్పా. పోనీ కేవలం లోదు-స్తులతో అయినా చేయాలని అడిగారు. అసలు దీని ద్వారా ఏం సాధించాలనుకుంటున్నారు? అని నేను వారిని ప్రశ్నించా. ఆ సీన్ చేయడానికి అంగీకరించలేదు. నన్ను అలా అడిగిన వ్యక్తి పేరు చెబితే మీరంతా కచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఆ స్థాయి ఉన్న వ్యక్తుల నుంచి అలాంటి మాటలు ఎవరూ ఊహించరు" అని రాధిక చెప్పుకొచ్చారు. కేవలం ప్రాజెక్ట్‌ను హిట్ చేయడానికి నటీమణులను హద్దులు దాటేలా ఒత్తిడి తేవడం సరికాదని ఆమె అన్నారు.



# విలన్‌గా నటించడానికి సిద్ధమే..

## భాగ్యశ్రీ బోర్సే

టాలీవుడ్ యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ అమ్మడు ఖాతాలో సరైన హిట్ పడలేదు. ఇక ఇటీవల భాగ్యశ్రీ 'లెనిన్' మూవీతో ఘనవిజయం సాధించి తన సత్తా చాటుకున్నారు. టాలీవుడ్, కోలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ భామ ఫుల్ ఫామ్‌లో ఉంది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్ సరసన 'సెయాన్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాలను ఎప్పుడూ జానర్ ఆధారంగా చూడనని, తనకు మాత్రం కథే ఎప్పుడూ మొదటి ప్రాధాన్యత అని భాగ్యశ్రీ స్పష్టం చేశారు. ఒక కథ నచ్చితే దాన్ని వదులుకునే ప్రసక్తే లేదని, దర్శకుడికి తనపై నమ్మకం ఉంటే.. ఆ పాత్రలో పూర్తిగా లీనమైపోతానని చెప్పారు. తాను కేవలం గ్లామర్ పాత్రలు లేదా హీరోయిన్‌గా మాత్రమే చేస్తానని చెప్పబోనని, తనలోని నటిని నిరూపించుకునే ఏ పాత్రనైనా చేయడానికి తాను సిద్ధమని తెలిపారు. తనను తాను సవాలు చేసుకునేలా విలన్ పాత్రలో నటించడానికి కూడా తాను వెనుకాడనని ఆమె తేల్చిచెప్పారు. తనలో తనకు బాగా నచ్చే లక్షణం తన మొండితనమని, తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని పేర్కొన్నారు. ఇక భాషల గురించి మాట్లాడుతూ.. తెలుగు, తమిళం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నానని, త్వరలోనే ఈ రెండు భాషల్లో బాగా మాట్లాడగలుగుతానని ఆశిస్తున్నానని చెప్పారు. నటిగా తనలో చాలా కలలు ఉన్నాయని భాగ్యశ్రీ చెప్పుకొచ్చారు.





# రెండో బిడ్డకు జన్మనిచ్చిన దీపిక పదుకొణె

బాలీవుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ మరోసారి తల్లిదండ్రులయ్యారు. శనివారం (సెప్టెంబర్ 19న) దీపిక రెండోసారి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. అందులో 'వెల్‌కమ్ బేబీ గర్ల్ (19-09-2026). ఇట్లు.. దువా, దీపిక, రణ్‌వీర్' అని రాసుకొచ్చారు. దీపిక, రణ్‌వీర్ దంపతులకు 2018లో ఇటలీలోని లేక్ కోమోలో ఘనంగా వివాహం జరిగింది. వీరికి తొలి సంతానంగా 2024లో 'దువా' జన్మించిన సంగతి తెలిసిందే. మరోవైపు దీపిక, రణ్‌వీర్ దంపతులకు బాలీవుడ్ నటీనటులు శుభాకాంక్షలు చెబుతున్నారు.

# భారీ ధరకు 'దాదా' శాటిలైట్ రైట్స్?

దిశ, సినిమా: నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ యాక్షన్ డ్రామా 'దాదా'. బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన 'వీరసింహారెడ్డి' వంటి చిత్రం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్పై అభిమానుల్లో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో నందమూరి బాలకృష్ణ సరసన అందాల భామ కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, టాలెంటెడ్ నటుడు మంచు మనోజ్ సరికొత్త పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాకు టాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత సతీష్ కిలారు ఏమాత్రం రాజీ పడకుండా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక షూటింగ్ దశలోనే ఉన్న ఈ సినిమాకు సంబంధించిన బిజినెస్ పరంగా అదిరిపోయే రికార్డులు నమోదవుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఈ ప్రాజెక్ట్ గురించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తూ, చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా, ఈ చిత్రానికి సంబంధించి ఓ భారీ డీల్ క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ 'జీ5' 'దాదా' చిత్రానికి సంబంధించిన డిజిటల్ రైట్స్, శాటిలైట్ హక్కులతో పాటు ఆడియో హక్కులను కూడా కలుపుకుని ఏకంగా రూ. 70 కోట్ల భారీ ధరకు సొంతం చేసుకుందని టాక్. సినిమా థియేటర్లలో విడుదలకు ముందే నాన్-థియేట్రికల్ మార్కెట్‌లో ఈ స్థాయిలో బిజినెస్ జరగడం బాలకృష్ణ సినిమా స్టామినాను మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇక అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 24, 2026న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# ఏఐ వల్ల జీరో శాతం కూడా ప్రమాదం లేదు

## ఎన్విడియా సీఈఓ



కృతిమ మేధపై ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2030 నాటికి ఏఐ ప్రపంచాన్ని అంతం చేస్తుందన్న వాదనలను తోసిపుచ్చారు. ఇందుకు ఆస్కారం లేదన్నారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ దశాబ్దం చివరి నాటికి ఏఐ వల్ల మానవళి అంతమవుతుందన్న వాదనల్లో అర్థం లేదు. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ప్రమాదం ఉందన్న వార్తలతో పలు కంపెనీలు కృతిమ మేధ అభివృద్ధిని నెమ్మదించడం సరికాదు. తమ సిస్టమ్‌ల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా అసురక్షితంగా భావించే సిస్టమ్‌లను విడుదల చేయొద్దు. ఇతరులతో సంబంధం లేకుండా సాధ్యమైనంత వేగంగా ఏఐ వైపు పయనించాలి" అని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ సూచించారు. మరోవైపు, ఏఐ వల్ల రానున్న పదేళ్లలో 10 శాతానికిపైగా జనం ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆంత్రోపిక్‌కు చెందిన పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఏఐ స్పీడ్‌కు ఇకనైనా కళ్లెం వేయాలని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్, ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఎక్స్ ఏఐ అధిపతి ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. దీంతో తాజాగా ఏఐపై ఎన్విడియా సీఈఓ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.






# మరోసారి బ్యాంకుల దేశవ్యాప్త సమ్మె..

## ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక అలర్ట్

బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు యూనియన్లు మరోసారి దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మె ప్రతిపాదన విషయాన్ని గుర్తు చేసిన ఎస్‌బీఐ.. ఖాతాదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. సమ్మె కాలంలో అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించేందుకు తాము అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని తెలిపింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలు, డిపాజిట్ వెండింగ్ మెషిన్లను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించింది. ప్రత్యామ్నాయంగా తమ కస్టమర్ సర్వీస్ పాయింట్లనూ వినియోగించుకోవాలని తెలిపింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఇతర డిజిటల్ వేదికలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని తెలిపింది. వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొంది. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు సహా పలు డిమాండ్లపై యూఎఫ్‌బీయూ ఈ నెల 11న సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగుల సమ్మెతో బ్యాంకు కార్యకలాపాలు దేశ వ్యాప్తంగా స్తంభించాయి. అయితే, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మరోసారి సమ్మె చేస్తామని గతంలోనే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 28 నుంచి మరోసారి ఉద్యోగులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. అప్పటికీ కేంద్రం దిగిరాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామంటూ ఇప్పటికే బ్యాంకు యూనియన్లు ప్రకటించాయి.



# ఇవే నా చివరి ఆసియా గేమ్స్ కావొచ్చు

## భారత స్టార్ షట్లర్ ప్రణయ్

భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడలే తనకు చివరివి కావొచ్చని తెలిపాడు. "మరో నాలుగేళ్ల తర్వాత ఇదే స్థాయిలో ఆడుతానో లేదో తెలీదు. బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు కావొచ్చు. ప్రస్తుతం శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నా. ఇటీవల వియత్నాం ఓపెన్‌లోనూ కొంతకాలం తర్వాత మంచి ప్రదర్శన చేశాను. గత ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని తృటిలో చేజార్చుకున్నాం. ఈసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకం గెలుస్తామని ఆశిస్తున్నా" అని ప్రణయ్ చెప్పుకొచ్చాడు. అయితే 2028లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగే ఒలింపిక్స్ ఆశలను మాత్రం అతడు వదులుకోలేదు. "ఎల్‌ఏ 2028ఏ నా లక్ష్యం. రాబోయే ఏడాదిన్నర వరకు గట్టిగా ప్రయత్నిస్తా. ఒలింపిక్స్‌కు వెళ్లే అవకాశం ఉందని అనిపిస్తే కొనసాగుతా. లేకపోతే ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటా. కిదాంబి శ్రీకాంత్ కోర్టులో చూపిస్తున్న పట్టుదల నాకు స్ఫూర్తినిస్తోంది. అతన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నేనూ అలా ఆడగలననే నమ్మకం వస్తుంది" అని పేర్కొన్నాడు. డబుల్స్ స్టార్ ఆటగాడు చిరాగ్ శెట్టి మాట్లాడుతూ.. "నిరుడు రజతం సాధించాం. గతాన్ని పక్కనపెట్టి ఈసారి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తాం. కోర్టులో చెలరేగే పులుల్లా ఆడి.. దేశానికి బంగారు పతకం అందిస్తాం. రాబోయే పది రోజుల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నాడు.

# ప్రతి మ్యాచ్‌లోనూ బాదడమే..

## మూడున్నరేళ్లకే బ్యాట్ పట్టి.. ఫాస్ట్‌గా టాప్ రేటింగ్ సాధించిన అభిషేక్ శర్మ



**అభిషేక్ శర్మ ఇప్పటి వరకు 56 అంతర్జాతీయ టీ20 మ్యాచులు ఆడాడు. భారత జట్టులోకి జులై 2024లో అరంగేట్రం చేశాడు. అంటే ఇప్పటికి సరిగ్గా 27 నెలలు మాత్రమే. అప్పట్నుంచి దాదాపు ప్రతి టీ20లోనూ ఆడాడు. గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌పై కేవలం 54 బంతుల్లోనే 135 పరుగులు చేసి ఆశ్చర్యపరిచాడు. అదే అతడిని ఐసీసీ టీ20 ర్యాంకుల్లోకి దూసుకెళ్లేలా చేసింది. తర్వాత ప్రతి మ్యాచ్‌లోనూ బాదడమే. గత ఆసియా కప్‌లో ఏడు మ్యాచుల్లో 200 స్ట్రైక్‌రేట్‌తో 314 పరుగులు చేశాడంటే అతడి దూకుడు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ టోర్నీలో శ్రీలంకపై 61 పరుగుల ఇన్నింగ్స్‌తో ఐసీసీ టాప్ రేటింగ్ (931 పాయింట్లు)ను అందుకొని రికార్డు సృష్టించాడు. అప్పటి వరకూ ఇంగ్లాండ్ ఆటగాడు డేవిడ్ మలన్ (919) పేరిట ఈ ఘనత ఉండేది. గతేడాది ఒక క్యాలెండర్ ఇయర్‌లో 202 స్ట్రైక్‌రేట్‌తో 1000కిపైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు.**

యువరాజ్ సింగ్‌ను అభిషేక్ శర్మ ఆరాధిస్తాడు. ఇక బ్రియాన్ లారా అంటే కూడా ఇష్టమే. వీరిద్దరి దూకుడును అభిషేక్‌లో చూడొచ్చు. కొవిడ్ సమయంలో యువీ వద్దే క్రికెట్ నైపుణ్యాలకు అభి పదునుపెట్టుకున్నాడు. ఇప్పటికీ యువీతో కలిసి ప్రాక్టీస్ చేస్తుంటాడు. ఈ మాజీ క్రికెటర్‌ను తన గురువుగా చెబుతుంటాడు. ఇక సోషల్ మీడియాలోనూ అభిషేక్ యాక్టివ్‌గా ఉంటాడు. అతడి ఇన్‌స్టాను దాదాపు 11 మిలియన్ల మంది ఫాలో అవుతారు. స్టైలిష్ లుక్‌తో కనిపించే అభి ఓసారి తన సహచరుడు వైభవ్ సూర్యవంశీని కూడా తనలాగే మార్చేశాడు. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్నప్పుడు వింబుల్డన్ మ్యాచ్‌ను చూసేందుకు వెళ్లిన వీరి ఫొటోలు వైరల్‌గా మారాయి.

పొట్టి ఫార్మాట్ అంటేనే వీరబాదుడు. అందుకే 26 ఏళ్ల అభిషేక్ శర్మను టీ20 స్పెషలిస్ట్ అంటారు. కేవలం బ్యాటర్ అయితే ఇంత చర్చ అవసరం లేదు. బంతితోనూ మెరిపించగలడు. జాతీయ జట్టుకు ఆడేటప్పుడూ తన పార్ట్‌టైమ్ స్పిన్‌తో ఆకట్టుకున్నాడు. మూడున్నరేళ్ల వయసులోనే బ్యాట్‌ను చేతబట్టాడు. అతడి తండ్రి రాజ్ కుమార్‌కు దేశవాళీ క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. అందుకేనేమో.. అభి చాలా త్వరగా క్రికెట్ పాఠాలను నేర్చుకున్నాడు. 2015-16 విజయ్ మర్చంట్ ట్రోఫీలో 1,200కిపైగా పరుగులు చేయడమే గాక, 57 వికెట్లు పడగొట్టాడు. ఆసియా కప్‌లో అండర్-19 జట్టుకు సారథిగానూ పనిచేశాడు. 17 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చాడు. 2018 వేలంలో నాటి ఢిల్లీ డేర్‌డెవిల్స్ అతడిని తీసుకుంది. మొదట్లో పెద్దగా ప్రభావం చూపించని ఈ కుర్రాడు.. ఎప్పుడైతే సన్‌రైజర్స్‌కు మారాడో, అప్పటినుంచి తనలోని అసలైన హిట్టర్‌కు బయటకు తెచ్చాడు. రికార్డులను కొల్లగొట్టాడు. అదే అతడిని భారత జట్టులోకి వచ్చేలా చేసింది.



# 3 కంపెనీలను హ్యాక్ చేసిన జెమినై ఏఐ..!

అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఓపెన్‌ఏఐకి చెందిన కృత్రిమ మేధ ఏజెంట్ సైబర్ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తాజాగా గూగుల్‌కు చెందిన ఏఐ మోడల్ 'జెమినై ఏఐ' కూడా 3 కంపెనీలను హ్యాక్ చేసింది. ఈ విషయాన్ని గూగుల్ ధ్రువీకరించింది. ఏజెంట్ల దాడి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ సంస్థ ఇటీవల సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను రూపొందించింది. దానిని పరీక్షిస్తున్న సమయంలో జెమినై తన నిర్దేశిత పరిధులను దాటి.. మూడు ఇతర కంపెనీలకు చెందిన డిజిటల్ సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే తమ ఏఐ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ పనిచేయడం దానంతట అదే ఆగిపోయిందని తెలిపింది. "సైబర్ సెక్యూరిటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇతర పాస్‌వర్డ్‌లను ఊహించి జెమినై ఏఐ బహిరంగ వెబ్ నుంచి మరో మూడు కంపెనీల డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలోకి అనధికారికంగా ప్రవేశించింది. ఈ హ్యాకింగ్ వల్ల ప్రభావిత కంపెనీల డేటాకు ఎటువంటి హాని జరగలేదని ధ్రువీకరించుకున్నాం. ఈ విషయంలో మా ఏఐ బాధ్యతాయుతంగా వ్యవహరించింది. హ్యాకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను ఇప్పటికే సంప్రదించాం. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల ఈ సమస్య తలెత్తింది. శక్తిమంతమైన ఏఐ నమూనాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా వాటికి శిక్షణ ఇవ్వడం ఎంత ముఖ్యమో దీని ద్వారా తెలిసింది" అని గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ హీథర్ అడ్కిన్స్ వెల్లడించారు.



# బట్లర్ విధ్వంసం..

## ఇంగ్లండ్ చేతిలో శ్రీలంక వైట్‌వాష్

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో శ్రీలంక వైట్‌వాష్‌కు గురైంది. మాంచెస్టర్ వేదికగా శనివారం జరిగిన చివరి టీ20లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో లంకపై విజయం సాధించింది. ఫలితంగా ఇంగ్లండ్ 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 18.5 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. పాతుమ్ నిస్సాంక (36), కమిందు మెండిస్ (35) పర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సొన్ని బేకర్, జోఫ్రా ఆర్చర్, విల్ జాక్స్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 9.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ జాస్ బట్లర్ (32 బంతుల్లో 62 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో విధ్వంసం సృష్టించగా, కెప్టెన్ హ్యారీ బ్రూక్ (33) రాణించాడు. లంక బౌలర్లలో తరిందు రత్నాయకే ఒక వికెట్ తీశాడు. మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసిన సొన్ని బేకర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 170 పరుగులు చేసిన హ్యారీ బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు కైవసం చేసుకున్నాడు. హ్యారీ బ్రూక్‌కు కెప్టెన్‌గా 26 మ్యాచ్‌ల్లో ఇది 23వ విజయం కావడం విశేషం. ఇరుజట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ మంగళవారం జరగనుంది.

# టీమ్‌ఇండియాకు దుస్తుల సమస్య

## రంగంలోకి బీసీసీఐ



ఆసియా క్రీడల కోసం టీమ్‌ఇండియా జట్టు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరనుంది. ఆతిథ్య దేశంతో టీ20 మ్యాచ్ కూడా ఆడనుంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లకు కిట్ సమస్యలు వచ్చాయి. తమ జెర్సీ సైజ్ విషయంలో వారు ఇబ్బంది పడుతున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆటగాళ్లు బయల్దేరడానికి కొన్ని గంటలే మిగిలి ఉండటంతో ఈ ఇబ్బందిని పరిష్కరించేందుకు బీసీసీఐ రంగంలో దిగిందని సమాచారం. ఇండియన్ ఒలింపిక్ అసోషియేషన్‌కు లైఫ్‌స్టైల్ కిట్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తోన్న జేఎస్‌డబ్ల్యూ ఇన్‌స్పైర్‌తో క్రికెట్ బోర్డు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. జపాన్‌తో జరిగే టీ20 మ్యాచ్‌కు ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీలకు వినియోగించే తమ స్టాండర్డ్ కిట్‌ను ఉపయోగించనున్నారు. తర్వాత అధికారిక ఆసియా గేమ్స్ జెర్సీని ధరించాల్సి ఉంది. అయితే, ఇక్కడే క్రికెటర్ల జెర్సీలు, ఇతర దుస్తుల సైజు విషయంలో సమస్యలు వచ్చాయని, వాటిలో చాలావాటిని సరిదిద్దామని ఐఓఏ వర్గాలు వెల్లడించాయి. సరిచేసిన కిట్లు త్వరలోనే జట్టుకు అందుతాయని చెప్పాయి. ప్రస్తుతం ఆటగాళ్లకు రెండు వేర్వేరు జెర్సీల అవసరముందని, అలాంటప్పుడు కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతుంటాయని పేర్కొన్నాయి. ఈ కిట్‌లో జెర్సీతో పాటు ట్రావెల్ గేర్, క్యాజువల్ అథ్లెటిక్ వేర్ వంటివి ఉంటాయి.

**వసతి సమస్య కూడా..** ఆసియా క్రీడల ఆతిథ్యనగరం నగోయాలో భారత అథ్లెట్లకు వసతి కేటాయింపు విషయంలో తీవ్ర ఆలస్యం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో బీసీసీఐ పురుషుల జట్టు కోసం స్వయంగా వేరే హోటల్‌లో వసతి ఏర్పాట్లు చేసింది. భారత మహిళల క్రికెట్ జట్టుకు మాత్రం ఐఓఏ ఏర్పాటు చేసిన వసతినే ఉపయోగించుకుంటుంది. వారికి ఎలాంటి సమస్యా లేదని తెలిపింది. ఆసియా క్రీడల క్రికెట్ టోర్నీకి ముందు జపాన్‌తో భారత్ సెప్టెంబర్ 22న టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ రెండు దేశాల మధ్య జరిగే తొలి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఇదే. భారత్-జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవానికి ప్రారంభ సూచికగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఆసియా క్రీడల జట్టులో ఉన్నాడు. ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ ఈ నెల 24న మొదలవుతుంది. నేరుగా నాకౌట్లో చోటు సంపాదించిన టీమ్‌ఇండియా.. ఈ నెల 28న తన తొలి మ్యాచ్ ఆడుతుంది.



# పోర్షే కంపెనీలో 4 వేలకు పైగా ఉద్యోగాల కోత!

జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ మరోసారి ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. తన అనుబంధ పోర్షేలో భారీగా లేఆఫ్స్ ప్రకటించనుంది. దాదాపు 4 వేలకు పైగా ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు జర్మనీకి చెందిన ఓ వార్తాపత్రిక వెల్లడించింది. ఆర్థిక పరమైన సమస్యలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పోర్షేలో సుమారు 4,100 మంది ఉద్యోగులను తొలగించాలని ఫోక్స్‌వ్యాగన్ సూపర్‌వైజరీ బోర్డు ప్రతిపాదించినట్లు సమాచారం. దాదాపు 803.8 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 7,715.81 కోట్లు) ఆర్థిక లోటును అధిగమించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సదరు పత్రిక పేర్కొంది. అయితే, జులై నెలలో కంపెనీ మేనేజ్‌మెంట్ ఇప్పటికే ప్రతిపాదించిన 9 వేల ఉద్యోగాల కోతలకు ఇవి అదనం అని తెలిపింది. చైనాలో కార్ల విక్రయాలు క్షీణించడం, ఎలక్ట్రిక్ వాహనాల వ్యూహంలో మార్పులు రావడంతో పోర్షే కంపెనీ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ తమ వార్షిక లాభాల అంచనాలను కూడా గణనీయంగా తగ్గించుకోవడం గమనార్హం.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com